
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శుక్రవారం 5 జనవరి 2024 | 5





ఏం తిని బతకాలి సీఎం గారూ!

మీరిచ్చే జీతానికి గడ్డి తిని బతకాలా! సీఎం గారూ.. వేతనాలు పెంచాలని గురువారం 24వ రోజు కొవ్వూరులో అంగన్‌వాడీలు ఇలా గడ్డి తింటూ నిరసన తెలిపారు. - కొవ్వూరు



తెలుగు మహాసభలకు గైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన భారీ వేదిక

నేటి నుంచే తెలుగు పండుగ

3 రోజుల పాటు నిర్వహణ

రాజానగరం, జనవరి 4 : తెలుగు పండుగకు వేళయింది.. రాజమహేంద్రరం ముస్తాబైంది.తెలుగు భాషా వికాసం కోసం ఆంధ్రమేవ జయతే నినాదంతో మూడు రోజుల పాటు నిర్వహించనున్న 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలకు గైట్ కళాశాల ముస్తాబైంది. చైతన్య విద్యాసంస్థలు, ఆంధ్రసారస్వత పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీరాజరాజనరేంద్రుల పట్టాభిషేక సహస్రాబ్దికి నీరాజనంగా శుక్రవారం నుంచి ఈ తెలుగు మహాసభలు నిర్వహించనున్నారు. ఇందుకోసం గైట్ కళాశాల ప్రాంగణంలో రాజరాజ నరేంద్ర, ఆదికవి నన్నయ, శ్రీనారాయణభట్టు వేదికలను ఏర్పాటు చేశారు. మహాసభల ఏర్పాట్లను చైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకులు కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు), ఆంధ్ర సారస్వత అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ మహాసభలకు జనవరి 5,6,7 తేదీల్లో దాదాపు లక్షా యాభై వేల మంది తెలుగు బాషాభిమానులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే అతిధులు బసచేసేందుకు గైట్ కళాశాలతో పాటు రాజమహేంద్రవరంలోని హోటళ్లలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి.సభలకు హాజరయ్యే అతిథులకు గైట్ కళాశాల ఆతిథ్యం ఇవ్వనుంది. ప్రధాన వేదికైన శ్రీరాజరాజ నరేంద్ర వేదిక సమీపంలోనే దాదాపు 80 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. తొలి రోజైన 5వ తేదీ శుక్రవారం ఉదయం 8.30 గంటలకు సదస్సుల అంకురార్పణ, 9 గంటలకు కవి సమ్మేళన అంకురార్పణ సభ, 10.30 గంటలకు శ్రీరాజరాజ నరేంద్ర వేదికపై మహాసభల ప్రారంభోత్సవం జరుగుతుంది. తెలుగు మహాసభల ప్రారంభోత్సవ సభకు విశాఖ శారదా పీఠం పీఠాదిపతి శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి విచ్చేస్తారు. సాయంత్రం 5 గంటలకు వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రముఖులకు పూర్ణకుంభం పురస్కారాలు ప్రధానం చేస్తారు.అనంతరం అష్టావధానం, పద్యకవితా సదస్సు, గద్య సాహిత్య సదస్సు, అవగాహన సాహిత్య సదస్సు, వాగ్గేయకార సాహిత్య సదస్సు, గజల్ కవి సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు కన్నుల పండువుగా జరగనున్నాయి.



తెలుగు మహాసభలకు ముఖద్వారం

రెండో రోజు ఇలా..

రెండో రోజైన 6న ఉదయం 10.30 గంటలకు కృతజ్ఞత సభకు ముఖ్యఅతిథిగా మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు, విశిష్ట అతిథులు తెలంగాణ ఐటీ పరిశ్రమల మంత్రి దిద్దిళ్ల శ్రీధర్‌బాబు, గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి, సీహెచ్ మానవేందర్‌రాయ్, యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ తదితర ప్రముఖులు హాజరుకానున్నారు. అదో రోజు సాయంత్రం జరిగే తెలుగు తోరణం, నృత్య రూపక ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరుకానున్నారు. భక్తి సాహిత్య సదస్సు, కవిత సాహిత్య సదస్సు, బాల సాహిత్య సదస్సు, పత్రికా సాహిత్య సదస్సు, తెలుగు వైజ్ఞానిక, గేయ సాహిత్యం, కథా సాహిత్య సదస్సు, అంతర్జాల మాధ్యమంగా అంతర్జాతీయ కవి సమ్మేళనం, అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

మూడో రోజు..

చివరి రోజైన 7వ తేదీన జరిగే ఆంధ్రమేవ జయతే సభకు నాగాలాండ్ గవర్నర్ రాగణేషన్ ముఖ్యఅతిథిగా, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వేంకటశేషసాయి విశిష్ట అతిథిగా హాజరుకానున్నారు. గౌరవ అతిథులుగా జేడీ లక్ష్మీనారాయణ, ఎం.కె.రామ్మోహన్ నాయుడు, మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు హాజరు కానున్నారు. సాయంత్రం 5 గంటలకు జరిగే సమాపనోత్సవానికి త్రిపుర గవర్నర్ ఎం.ఇంద్రసేనారెడ్డి,విశిష్ట అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి యు.దుర్గాప్రసాదరావు హాజరుకానున్నారు. ఆకాశ వాణి, దూరదర్శన్ బుల్లి తెరలలో తెలుగు వికాసం సదస్సు, ప్రవాంధ్రుల సాహితీ తపస్సు సదస్సు, ఆధునిక సాహిత్య సదస్సు, ప్రదర్శనాత్మక సాహిత్య సదస్సు, హాస్య వ్యంగ్య, చమత్కార సాహిత్య సదస్సు, చలనచిత్ర సాహిత్య సదస్సులు జరగనున్నాయి.

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో..
రేపు రాజమహేంద్రవరంలో ముత్యాల ముగ్గుల పోటీలు



రాజమహేంద్రవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏడాది వచ్చినట్టే ఈ ఏడాది ముగ్గుల పండుగ వచ్చేసింది.. మహిళాలోకానికి బహుమతులు విందు చేయనుంది.రాజమహేంద్రవరం పట్టణం జేఎన్ రోడ్డులో రిలయన్స్ డిజిటల్ ఎదురుగా ఉన్న షిర్డీసాయి జూనియర్ కాలేజీ ఆవరణలో "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" ఈ నెల 6న శనివారం జరగనున్నాయి.ఉదయం 9 గంటలకు ముత్యాల ముగ్గుల పోటీలు ప్రారంభమవుతాయి.జిల్లా పోటీలకు స్పాన్సరర్‌గా రాజమహేంద్రవరానికి చెందిన భవానీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవహరిస్తోంది. విజేతలైన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలవారికి రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు చొప్పున నగదు బహుమతులు ఉంటాయి. పోటీల్లో పాల్గొనే మహి ళలు పేర్లు నమోదుకు 99854 11248 నెంబర్‌లో సంప్రదించగలరు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి మహిళలు పాల్గొనవచ్చు.

వైసీపీ వదిలేసింది..
కేంద్రం దారి చూపింది!



నిడదవోలు ఆర్‌వోబీ నిర్మాణంపై కదలిక

- పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- ఎట్టకేలకు కదిలించిన కేంద్రం
- సేతుబంధన నిధులతో నిర్మాణం
- సంక్రాంతి తరువాత పనులు ఆరంభం
- తీరనున్న గోదావరివాసుల కల

నిడదవోలు, జనవరి 4 : నిడదవోలు పట్టణ నడిబొడ్డులో 2019జనవరి 7న ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించి పైలాన్ ఆవిష్కరించి 18 నెలల్లో ఆర్వోబీ నిర్మాణం పూర్తి కావాలని నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు ఆదేశించారు.ఇది జరిగి ఐదేళ్లవుతోంది..నాడు ఎంత పని చేశారో నేటికీ అంతే..ఎందుకంటే వైసీపీ ప్రభుత్వంలో కనీసం కదలిక లేదు.చంద్రబాబు ఆశయమూ నెరవేరలేదు..ఈ బ్రిడ్జి నిర్మాణంపై ఎట్టకేలకు కదలిక వచ్చింది.. వైసీపీ ప్రభుత్వం గాలి కొదిలేసినా..కేంద్ర ప్రభుత్వం మాత్రం గోదావరి జిల్లావాసులకు సంక్రాంతి పండుగకు పెద్ద కానుక ఇస్తోంది.

నాడు టీడీపీ హయాంలో శ్రీకారం..

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిడదవోలు పట్టణంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నాడు ఎమ్మెల్యేగా ఉన్న బూరుగుపల్లి శేషారావు నిడదవోలు నెహ్రూబొమ్మ సెంటరులో ఉన్న రైల్వే గేటు స్థానంలో ఆర్వోబీ నిర్మాణానికి పాటుపడ్డారు. నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిడదవోలు గాంధీ బొమ్మ సెంటరులో ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించి పైలాన్ కూడా ఆవిష్కరించారు. అనంతరం ఎన్నికలు రావడం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రివర్స్ టెండరింగ్ ప్రక్రియలో ఆర్వోబీ నిర్మాణ ప్రారంభం గాలికి కొట్టుకుపోయింది. నాలుగన్నరేళ్లుగా ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని గాలికొదిలేశారు. ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి ఆ ఆలోచనే లేదు. నిడదవోలుకు రెండు సార్లు సీఎం జగన్ వచ్చినా కనీసం పట్టించుకోలేదు. స్థానిక వైసీపీ నాయకులు ఆ దిశగా చేపట్టిన చర్యలు శూన్యం. ఇదిలా ఉండగా నిడదవోలు ఆర్వోబీ నిర్మాణంపై కేంద్రం స్పందించింది. సేతుబంధన్ స్కీమ్ ద్వారా ఆర్వోబీ నిర్మాణానికి ప్రతిపాదించిన నిధులు మంజూరు చేసింది.ఇప్పటికే ఆర్వోబీ నిర్మాణ స్థల సేకరణకు సంబంధించి స్థల యజమానులకు సొమ్ములు వారి ఖాతాలకు జమయ్యాయి. దీనిపై గతంలోనే ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది.కేంద్ర ప్రభుత్వ నిధులతో ఆర్వోబీ నిర్మాణానికి పిలిచిన టెండర్లకు కాంట్రాక్టర్ రావడం టెండర్ ఖరారు కావడం జరిగింది.దీంతో ఆర్వోబీ కనస్ట్రక్షన్ కంపెనీ రంగంలోకి దిగింది. సంక్రాంతి పండుగ తరువాత ఆర్వోబీ నిర్మాణ పనులు వేగవంతం కానున్నాయి. నాడు తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో రైల్వేగేటు స్థానంలో ఆర్వోబీ నిర్మాణానికి ఏ డిజైన్ అయితే ఖరారు చేశారో ఇప్పుడు అదే డిజైను యథావిధిగా నిర్మాణం జరుగనున్నట్టు సమాచారం. దీంతో ఉభయ గోదావారి జిల్లాల వాహనదారుల ప్రధాన సమస్య అతి త్వరలోనే తీరనుంది.

ఆర్వోబీకి కేటాయించిన నిధుల వివరాలు

ఆర్వోబీ నిర్మాణం వ్యయ అంచనా	రూ.201 కోట్లు
భూసేకరణకు	రూ. 21 కోట్లు
సేతుబంధన్ నిధులు	రూ.124 కోట్లు
కేంద్ర రైల్వే శాఖ వాటా	రూ.56 కోట్లు
భూ సేకరణ వివరాలు	6.14 ఎకరాలు
ప్రభుత్వ భూమి	5.11 ఎకరాలు
ప్రైవేటు భూమి	1.03 ఎకరాలు
స్థల యజమానులు	51 మంది



మునిసిపల్ ఆర్‌జేడీ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న మునిసిపల్ కార్మికులు


జిల్లాలో 1046 మంది సమ్మె
కొవ్వూరులో పారిశుధ్యం పరిశీలించిన ఆర్‌జేడీ

కొవ్వూరు, జనవరి 4 : సమాన పనికి సమాన వేతనం రూ. 26 వేలు అందించాలని మునిసిపల్ కార్మికులు రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎస్‌వీవీ సత్యనారాయణకు గురువారం వినతిపత్రం అందజేశారు. మునిసిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మె నేపథ్యంలో కొవ్వూరు మునిసిపాలిటీని గురువారం ఆర్‌జేడీ ఆకస్మిక తనిఖీ చేశారు. పట్టణంలో పారిశుధ్యం పరిశీలించి మునిసిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ చాంబర్‌లో ఆర్‌జేడీ సత్యనారాయణ మాట్లాడుతూ మునిసిపల్ కార్మికుల డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం, అధికారులు సానుకూలంగా ఉన్నారని..కార్మికులు సహకరించాలన్నారు. జిల్లాలో 1046 మంది మునిసిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులు సమ్మె బాటపట్టారన్నారు. రాజమహేంద్రవరంలో 767, నిడదవోలులో 91, కొవ్వూరు మునిసిపాలిటీలో 98 మంది కార్మికులు సమ్మెలోకి వెళ్లారన్నారు. అయినప్పటికి పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణలో ఎటువంటి సమస్య తలెత్తకుండా పర్మినెంటు కార్మికులతో పనులు చేయిస్తూ ప్రజలకు సేవలు అందజేస్తున్నామన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరుపుతుందని, ఇప్పటికే కొన్ని డిమాండ్లు పరిష్కరించడం జరిగిందన్నారు. మిగిలిన డిమాండ్ల పరిష్కారానికి ఫైనాన్స్ డిపార్టుమెంటుతో చర్చలు జరుగుతున్నాయన్నారు. ఒకటి, రెండు రోజులలో చర్యలు ఫలించి కార్మికులు సమ్మె నుంచి విధుల్లోకి చేరతారన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో సమ్మెలోకి వెళ్లిన కార్మికులు తిరిగి విధుల్లో చేరారన్నారు. నరసాపురంలో ఔట్ సోర్సింగ్ కార్మికులకు మద్దతుగా సమ్మె చేపట్టిన పర్మినెంటు కార్మికులు సమ్మె విరమించి విధుల్లో చేరడం జరిగిందన్నారు. కొవ్వూరులో గత నెల 27వ తేదీ నుంచి మునిసిపల్ కార్మికులు సమ్మెలో ఉన్నారు. రాజమహేంద్రవరం, నిడదవోలులో మాత్రం బుధవారం నుంచి సమ్మెలో దిగారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు కమిషనర్ బి. శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఈవీఎంలు, వీవీ ప్యాట్లపై అవగాహన కల్పించాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం, జనవరి4(ఆంధ్రజ్యోతి) : భారత ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓటు హక్కు వినియోగాన్ని అత్యంత పారదర్శకంగా ఉండే విధంగా కంట్రోలు యూనిట్స్‌లు, ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు ప్రవేశపెట్టారని జిల్లా కలెక్టర్ డా. కె.మాధవీలత తెలిపారు.కలెక్టరేట్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద గురువారం ఏర్పాటు చేసిన ఓటరు హెల్ప్ డెస్క్‌లో ఎలక్ట్రానిక్ యూనిట్ల ప్రదర్శనను ప్రారంభించి మాట్లా డారు. ఈవీఎంలు, వీవీప్యాట్లపై ప్రతి ఓటరుకు అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టామన్నారు. ఓటర్లు, అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించే నిమిత్తం నమూనా యూనిట్ల ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎన్.తేజ్‌భరత్,డీఆర్‌వో నరసింహం, డీపీవో జె.సత్యనారాయణ, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కెఎస్.జ్యోతి, కేఆర్‌ఆర్సీ డిప్యూటీ కలెక్టర్ కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.







ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



యాగంలో పాల్గొన్న చైతన్యరాజు, బాపిరాజు దంపతులు

శ్రీవారి వైభవోత్సవం

గైట్‌లో ఘనంగా ప్రారంభమైన చతుర్వేద మహాయాగం



రాజానగరం, జనవరి 4: లోక కల్యాణం, విశ్వశాంతిని కాంక్షిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వ ర్యంలో గైట్ ప్రాంగణంలో గురువారం శ్రీవారి వైభవోత్సవం, చతుర్వేద మహాయాగం వైభవో పేతంగా నిర్వహించారు. చైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకుడు కేవీవీ సత్య నారాయణరాజు (చైతన్యరాజు) దంపతులు, కిమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ రవికిరణ్‌వర్మ దంపతులు, గైట్ మేనేజింగ్ డైరెక్టర్ శశికిరణ్ వర్మ దంపతులు, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు దం పతులు జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీవారి వైభవోత్సవం, చతుర్వేత మహా యాగాలను ప్రారంభించారు. అనంతరం స్వామివారికి సుప్రభాతం, తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్ర నామార్చన, నివేదనము, సర్వ దర్శనం, తిరుప్పావడ సేవతో పాటు శ్రీవారి కల్యాణోత్సవం కన్నుల పండువగా తిరుపతి వైఖానస ఆగమ పండితులు దీవి బాలాజీ రంగా చార్యులు పర్యవేక్షణలో అంగరంగ వైభ వంగా జరిపించారు. అలాగే సాయంత్రం నుంచి స్వామివారి సర్వ దర్శనం, శుద్ధి ఏకాంత సేవా కార్య క్రమాలు నిర్వహించారు. అన్నవరం, ద్వారకా తిరుమల నుంచి వచ్చిన రథాలతో కొలువైన సత్యదేవుడు, శ్రీవేంకటేశ్వరస్వామికి కూడా ఆయా ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో ద్వాదశి జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బైర్రాజు ప్రసాదరాజు, మాజీ ఎమ్మెల్యే ఈలి నాని, ప్రముఖులు డీబీవీ రాజు, కేశవరాజు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

నేటి నుంచే గైట్ ప్రాంగణంలో
తెలుగు మహాసభలు

రాజానగరం, జనవరి 4: చైతన్య విద్యా సంస్థలు, ఆంధ్ర సారస్వత పరిషత్ సంయుక్తంగా గైట్ ప్రాంగణంలో తలపెట్టిన అంతర్జాతీయ తెలుగు మహా సభలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీరాజరాజ నరేంద్రుల పట్టాభిషిక్త సహస్రాబ్ది ఉత్సవాలు నీరాజనంగా నన్నయ భట్టారకుని మహాభారతం వెయ్యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అంతర్జాతీయ తెలుగు మహా సభలను రాజమహేంద్రవరం వేదికగా గైట్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు చైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకులు కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు గజల్ శ్రీనివాస్ తెలిపారు. మూడు రోజులు పాటు తెలుగు మహాసభలు జరుగు తాయన్నారు. దీనిలో భాగంగా గైట్ ప్రాంగణంలో రాజరాజ నరేంద్రుని వేదికతో పాటు గైట్ డిగ్రీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాలలో నారాయణభట్టు వేదిక, ఆదికవి నన్నయ్య వేదికలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.



ప్రత్యేక అలంకరణలు



కొలువుదీరిన మహనీయుల విగ్రహాలు

రాజానగరం, జనవరి 4: అంతర్జాతీయ తెలుగు మహాసభలను పురస్కరించుకుని గైట్ ప్రాంగణంలోని ప్రధాన వేదికల వద్ద ఏర్పాటు చేసిన ప్రముఖుల విగ్రహాలు జీవకళ ఉట్టిపడుతూ చూపరులను ఇట్టే కట్టిపడేస్తున్నాయి. గైట్ ప్రాంగణంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న అంతర్జాతీయ తెలుగు మహా సభల ప్రధాన వేదిక వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేసిన ప్రముఖుల విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. తెలుగు భాషకు శోభనద్దిన ప్రముఖుల విగ్రహాలు అంతర్జాతీయ తెలుగు మహాసభల ప్రధాన వేదిక వద్ద కొత్త అందాలను తెచ్చిపెడుతున్నాయి. విద్యార్థులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చినవారంతా ఆయా విగ్రహాల వద్ద నిలబడి ఫొటో తీసుకుంటున్నారు. గోదావరి ప్రాంత అన్నదాతల ఆరాధ్య దైవంగా భావించే సర్ ఆర్థర్ కాటన్, ఎంఎస్ సుబ్బలక్ష్మి, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, సంఘ సంస్కర్త వీరేశలింగం పంతులు, కవయిత్రి మొల్ల విగ్రహాలు జీవకళతో ఉట్టిపడుతున్నాయి.









కోరికలు దుఃఖానికి మూలం

ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు



అనపర్తి, జనవరి 4: కోరికలు దుఃఖానికి మూలమని నియమ బద్ధంగా జీవితాన్ని గడిపేవారు, ధర్మాన్ని ఆచరించే వారు జన్మ రాహిత్యాన్ని పొందుతారని మహా సహస్రావధాని గరికపాటి నరసి ంహారావు అన్నారు. అనపర్తిలోని టీటీడీ కల్యాణ మండపంలో శ్రీ శారదా సంగీత కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధనోత్సవాలలో భాగంగా మూడో రోజైన గురువారం త్యాగ మూర్తి కుంతి అంశంపై ఆయన ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మహాభారత పాత్రల విశ్లేషణ త్యాగమూర్తి కుంతీదేవిపై తనదైన శైలిలో చమత్కారాలు, చలోక్తులతో ఆధ్యాత్మిక ప్రవచనం సాగింది. ఈ కార్యక్రమంలో మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, నేత్ర వైద్యులు తేతలి సత్యనారాయణరెడ్డి, ఆధ్యాత్మికవేత్త రెడ్డి సురేష్‌శర్మ, కొవ్వూరి రఘునాథరెడ్డి, నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, సత్తి రామారెడ్డి, కర్రి వెంకట రామకృష్ణారెడ్డి, బచ్చు వీరవెంకటరమణ, లింగం ఫణికుమార్, మేడపాటి చెల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యనమదల మురళీకృష్ణకు మధునాపంతుల పురస్కారం



కార్పొరేషన్(కాకినాడ), జనవరి 4: ఆయుర్వేద ఆచార్య, భాషా ప్రవీణ మధునా పంతుల సూరయ్యశాస్త్రి శత జయంతి సంద ర్భంగా కాకినాడకు చెందిన ప్రముఖ సాంక్ర మిక వైద్య నిపుణులు డాక్టర్ యనమదల మురళీకృష్ణకు ప్రతిభా పురస్కారం ప్రదానం చేయనున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలి పారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలం లోని పల్లిపాలెం గ్రామానికి చెందిన మధునా పంతుల సూరయ్యశాస్త్రి ఆయుర్వేద వైద్యుడిగా కవిగా, పండితుడిగా ప్రఖ్యాతిగాంచారు. తన శిష్యులను చాలామందిని ఉన్నత, ఉత్తమపౌ రులుగా తీర్చిదిద్దారు. ఆయుర్వేద వైద్యుడిగా ప్రత్యేకించి దీర్ఘకాల క్లిష్ట మైన రోగాలకు చికిత్సను అందించి ఎందరినో స్వస్థపరిచారు. ఆయన శత జయంతి ఉత్సవం సందర్భంగా ఈనెల 14న పల్లిపాలెంలోని మధునాపంతుల కామరాజు సాంస్కృతిక ప్రాంగణంలో నిర్వహించే కార్యక్రమంలో డాక్టర్ యనమదల మురళీకృష్ణను ప్రతిభా పురస్కా రంతో సత్కరించనున్నట్లు మధునాపంతుల సత్యనారాయణమూర్తి తెలిపారు. ఇటీవల కొవిడ్ సమయంలోను, గతంలో ఎయిడ్స్ బాధి తుల గురించి సాధికారమైన వైద్య విజ్ఞానాన్ని విస్తృతంగా ప్రజలకు అందుబాటులోకి తెచ్చి ప్రజల్లో భరోసా నింపినందుకుగాను ఆయనను ఈ ప్రతిభా పురస్కారంతో గౌరవిస్తున్నట్లు తెలిపారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు



సామర్లకోట, జనవరి 4: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచు కుని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ సెక్షన్ పరిధిలో సామర్లకోట మీదుగా ఎనిమిది సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపనున్నట్లు రైల్వే ఉన్నతాధికారి కార్యాలయం నుంచి గురువారం రాత్రి సమాచారం అందింది. ఈ మేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారి నుంచి ఆంధ్రజ్యోతి సమాచారాన్ని సేకరించింది.

07027 నంబరు గల హైద్రాబాద్- బెరహమ్‌పూర్ మధ్య రాకపోకలు సాగించేందుకు సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 13 తేదీ శనివారం ఒక ట్రిప్ బయలుదేరనుంది. ఈ రైలు శనివారం హైద్రాబాద్‌లో రాత్రి 10.40 నిమిషాలకు బయలుదేరి శనివారం సాయంత్రం 3.15 గంటలకు బెరహమ్‌పూర్ చేరుకుంటుంది. మార్గమధ్యంలో జనగాం, ఖాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, కొండపల్లి, రాయనపాడు, ఏలూరు, నిడదవోలు, రాజమండ్రి మీదుగా సామర్లకోటకు ఉదయం 8.13కి చేరుకుని అన్నవరం 8.45కి చేరుకుని అనకాపల్లి మీదుగా బెరహమ్‌పూర్‌కు ఆదివారం సాయంత్రం 3.15కి వెళతుంది.

07028 నంబరు గల బెరహమ్‌పూర్-హైద్రాబాద్ మధ్య సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం జనవరి 14 తేదీ సాయంత్రం 6.00కి బయలుదేరి దువ్వాడకు రాత్రి 11.30కి చేరుకుంటుంది. అన్నవరానికి అర్ధరాత్రి 12.43కి చేరుకుంటుందని, సామర్లకోటకు రాత్రి 1.23కి చేరుకుంటుందన్నారు. రాజమండ్రి, నిడదవోలు, ఏలూరు, రాయనపాడు, ఖమ్మం, వరంగల్, జనగాం, సికింద్రాబాద్ మీదుగా హైద్రాబాద్‌కు సోమవారం ఉదయం 11.30 గంటలకు చేరుకుంటుంది.

07022 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు కాకినాడ-సికింద్రాబాద్ మధ్య జనవరి 12న శుక్రవారం సాయంత్రం 5.40కి బయలుదేరనుంది. ఈ రైలు సామర్లకోటకు రాత్రి 6.10కి చేరుకుంటుంది. అనపర్తికి 6.30కి చేరుకుని రాజమండ్రికి రాత్రి 6.50కి చేరుకుంటుంది. నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, రాయనపాడు, కొండపల్లి, ఖమ్మం, వరంగల్, ఖాజీపేట మీదుగా సికింద్రాబాద్‌కు శనివారం తెల్లవారుజామున 5.55కి చేరుకుంటుంది.

07221 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్-కాకినాడ మధ్య జనవరి 11న గురువారం రాత్రి 9 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరనుంది. ఈ రైలు ఖాజీపేట, వరంగల్, ఖమ్మం, కొండపల్లి, రాయనపాడు, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, నిడదవోలు మీదుగా రాజమండ్రికి శుక్రవారం ఉదయం 6.10కి చేరుకుని, అనపర్తికి 6.30కి, సామర్లకోటకు 6.50కి, కాకినాడకు 8 గంటలకు చేరుకుంటుంది.

07025 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్-బెరహమ్‌పూర్ మధ్య జనవరి 12,19 తేదీలలో ప్రతీ శుక్రవారాలలో బయలుదేరనున్నాయి. ఈ రైలు శుక్రవారం రాత్రి 7.45కి సికింద్రాబాద్‌లో బయలుదేరి పగిడిపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా రాజమండ్రికి శనివారం తెల్లవారుజామున 3.08కి చేరుకుని, సామర్లకోటకు 3.45కి చేరుకుంటుంది. అన్నవరం, అనకాపల్లి, పెందుర్తి, విజయనగరం, శ్రీకాకుళం, ఇచ్ఛాపురం మీదుగా బెరహమ్‌పూర్‌కు శనివారం ఉదయం 11.15కి చేరుకుంటుంది.

07026 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు బెరహమ్‌పూర్-సికింద్రాబాద్ మధ్య జనవరి 13,20 తేదీలలో ప్రతీ శనివారాలలో మధ్యాహ్నం 12.30కి బయలుదేరనున్నాయి. ఈ రైలు బెరహమ్‌పూర్‌లో మధ్యాహ్నం 12.30కి బయలుదేరి ఇచ్ఛాపురం, శ్రీకాకుళం, విజయనగరం, పెందుర్తి, అనకాపల్లి మీదుగా అన్నవరానికి సాయంత్రం 6.23కి చేరుకుని సామర్లకోటకు రాత్రి 7.08కి చేరుకుంటుంది. రాజమండ్రికి రాత్రి 7.55కి చేరుకుని తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, మిర్యాలగూడ, నల్గొండ, పగిడిపల్లి మీదుగా సికింద్రాబాద్‌కు ఆదివారం ఉదయం 6.30కి చేరుకుంటుంది. మరిన్ని వివరాలకు, రైలు రిజర్వేషన్ టిక్కెట్లకు సమీప రైల్వే స్టేషన్ బుకింగ్ కార్యాలయాల వద్ద సంప్రదించాలని రైల్వే ఉన్నతాధికారి అందించిన సమాచారంలో తెలిపారు.

అంతర్వేది లక్ష్మీనరసింహుడి ఆదాయం రూ.47 లక్షలు



ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

అంతర్వేది, జనవరి 4: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖి నేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం హుండీలను తెరిచి కానుకలను లెక్కించారు. 98 రోజులకు ప్రధాన హుండీ, గుర్రాలక్కమ్మ హుండీల ఆదాయం రూ.46,08,255, అన్నదానం హుండీ ఆదాయం రూ.91,805 వచ్చింది. హుండీల ద్వారా మొత్తం రూ.47,00,060 ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. కార్య క్రమంలో జిల్లా ఏసీ కేఎన్వీడీవీ ప్రసాద్, తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ బైరా నాగరాజు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

8న అప్రంటీస్ మేళా

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 4: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ కంపెనీల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయడానికి ఈనెల 8న ప్రైమినిస్టర్ నేషనల్ అప్రంటీస్ మేళా-24 నిర్వహి స్తున్నట్లు జిల్లా కన్వీనర్, కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎంఈవీ వర్మ తెలిపారు. జిల్లాలోని ప్రముఖ పరిశ్రమల నుంచి మేనేజ్‌మెంట్, స్టాఫ్ వచ్చి వారికి కావాల్సిన అప్రంటీస్ ట్రైనీస్‌ను ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లోని వివిధ ట్రేడ్‌ల్లో ట్రైనింగ్ పూర్తి చే సిన ఎన్‌టీసీ సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 8639230775 నెంబరును సంప్రదించాలన్నారు.

పాత సామాన్ల దుకాణంలో అగ్నిప్రమాదం

రూ.2 లక్షల ఆస్తినష్టం

కాకినాడ క్రైం, జనవరి 4: ఓ పాత సామాన్ల దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించి రూ.2లక్షల మేర ఆస్తినష్టం జరి గింది. ఈ ప్రమాదం కాకినాడలో గురువారం జరిగింది. రేచర్ల పేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సి)కి సమీ పంలో జాకీర్ హుస్సేన్ అనే వ్యక్తి నిర్వహిస్తున్న పాత సామాన్ల (స్క్రాప్) దుకాణంలో గురువారం రాగిని వేరు చేసే క్రమంలో వైర్లు కాల్చుతూ అక్కడ పనిచేసే వ్యక్తులు మంటను ఆపకుండా మార్చిపోయి బయటకు వెళ్లారు. దీంతో గాలి అధిక మవ్వడంతో మంటలు ఎగిసిపడి అగ్నికీలలు దావానంలా వ్యాపించాయి. ఈ క్రమంలో దుకాణం అగ్నికి ఆహుతి అయ్యింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సాలిపేట అగ్నిమాపకాధికారి బి.ఏసుబాబు తన సిబ్బంది, శకటంతో హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదం జరిగిన సమయానికి సంఘటనా స్థలంలో ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్ట య్యింది. అగ్నిమాపక సిబ్బందికి, స్థానికులు సహకరించడంతో మంటలు మరింత వ్యాప్తి చెందకుండా నిలువరింపజేయగలి గారు.

కొండరెడ్ల గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన

కేంద్ర ప్రభుత్వ మోటా డిప్యూటీ కార్యదర్శి మనోజ్‌కుమార్



మాట్లాడుతున్న మనోజ్‌కుమార్

రంపచోడవరం, జనవరి 4: ఏజెన్సీలో నిరుపేద కొండరెడ్లకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వ మోటా డిప్యూటీ కార్యదర్శి మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, రాష్ట్ర ట్రైకార్ జనరల్ మేనేజన్ మణికుమార్‌తో కలిసి మండలంలోని కొయ్యలగూడెం గ్రామంలో పర్యటించారు. జన్మన్ పథకం ద్వారా కొండరెడ్లకు గృహాలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఐటీడీఏ పీవో మాట్లాడుతూ కొండరెడ్లకు సంబంధించి సర్వే జరుపు తున్నామన్నారు. అనంతరం ఐఈసీ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీవో(జీ) సీహెచ్ శ్రీనివాసరావు, ఎంపీడీవో హరికృష్ణ, ఎంపీటీసీ నర్రి పాపారావు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులకు చేసిందేమీలేదు

ఎమ్మెల్సీ ఐవీ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవీ

కాకినాడ సిటీ, జనవరి 4: ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీలేదని, గొప్పలకు పోయి సంక్షేమ పథకాల పేరుతో అప్పులు చేస్తోందని ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెం కటేశ్వరరావు ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కాకినాడలోని ధర్నాచౌక్ వేదికగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేవీవీ నగేష్ అధ్యక్షతన గురువారం ధర్నా శిబిరాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఐవీ మాట్లాడుతూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. భవిష్యత్‌లో మరింత పెద్ద పోరాటానికి యూటీఎఫ్ నాయకత్వం వెనుకాడదని హెచ్చరిక చేశారు. యూటీఎఫ్‌తో, ఉద్యోగ ఉపాధ్యాయులతో పెట్టుకున్న ప్రభుత్వాలు ఎక్కువ కాలం మనగలగలేదన్నారు. ఈ విషయాన్ని జగన్‌రెడ్డి తెలుసుకుని తక్షణమే డిమాండ్లు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ వెంటనే పెండింగ్ బకాయిలు చెల్లించకపోతే పోరుబాటను మరింత ఉధృతం చేస్తామన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేస్తామని చెబుతున్న ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయి సొమ్ములు విడుదల చేయకుండా తమ స్వార్థానికి, సంక్షేమ పథకాలను వాడుకుంటోందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రవిచక్రవర్తి మాట్లాడుతూ ప్రభుత్వం, విద్యాశాఖ నిరంకుశ వైఖరి విడనాడి ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి మాట్లాడుతూ అంగన్‌వాడీలు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉద్యోగ ఉపాధ్యాయులు సమ్మెలో ఉంటే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నట్లు ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం ఎంతమాత్రం తగదన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జి.ప్రభాకరవర్మ, కె.సత్తిరాజు, ఎంవీ సాయిరాం, పీవీ రమణ, నాగమణి, ఐ.ప్రసాద్‌రావు, సురేష్‌కుమార్, పీవీవీ సత్యనారాయణ, వీరబాబు, సూరిబాబు పాల్గొన్నారు.

బైక్ ప్రమాదంలో మరో వ్యక్తి మృతి



స్వామిసతీష్(ఫైల్)

ప్రత్తిపాడు, జనవరి4: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం లంపకలోవ గ్రామం వద్ద బుధవారం రాత్రి చెట్టుకు మోటార్ బైక్ ఢీ కొన్న దుర్ఘటనలో తీవ్రంగా గాయపడ్డ 2వ సర్వేయర్ మలిరెడ్డి స్వామి సతీష్(26) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదంలో సంఘటనా స్థలం వద్దే సర్వేయర్ మురళీ అక్కడిక క్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. తీవ్రంగా గాయ పడిన స్వామి సతీష్‌ను అర్ధరాత్రే కాకినాడ జీజీహెచ్ అత్యవసర విభాగానికి తరలించి వైద్యసేవలు అందించి నప్పటి బ్రెయిన్ డెడ్ కావడంతో గురువారం మధ్యాహ్నం స్వామి సతీష్ మృత్యువుతో పోరాడి తుది శ్వాస విడిచారు. ఈ ప్రమాదంలో ఇరువురు యువ సర్వే యర్లు మృత్యువాత పడటం జిల్లా రెవెన్యూ యంత్రాంగాన్ని విస్మయ పరి చింది. జరిగిన ప్రమాదంపై పలువురు అధికారులు విచారం వ్యక్తం చేశారు. మురళిది ఏలేశ్వరం కాగా,స్వామి సతీష్‌ది పిఠాపురం మండలం మల్లం గ్రామం. ఈ ఇరువురు ఏలేశ్వరం మండలంలో గత రెండేళ్లుగా సర్వే యర్లుగా విధులు నిర్వహిస్తున్నారు.

కాటన్ బ్యారేజ్ రోడ్డు పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

ధవళేశ్వరం, జనవరి 4: గతుకుల మయంగా మారి, ప్రమాదకరంగా పరిణమించిన కాటన్ బ్యారేజ్ రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభమ య్యాయి. రోడ్డు పనులను తూర్పుగోదావరిజిల్లా కలెక్టర్ మాధవీ లత గురువారం పరిశీలించారు. పను లను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశిం చారు. ఇరిగేషన్ అధికారులు పర్యవే క్షించి పనులకు సంబంధించి ఎప్పటిక ప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశిం చారు. హెడ్ వర్క్స్ ఈఈ ఆర్. కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

అందని ద్రాక్షగా ప్రభుత్వ హామీలు



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ముమ్మిడివరం, జనవరి 4: అందని ద్రాక్షగా ప్రభుత్వ హామీలు ఉన్నాయని, దీక్షా శిబిరంలో తాడుకి ద్రాక్ష పండ్ల గుత్తులు కటి వినూత్నంగా నిరసన తెలిపారు నగర పంచాయతీ కాంట్రాక్టు ఉద్యోగులు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ అవుట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మి కులు చేపట్టిన సమ్మె గురువారం నాటికి పదో రోజుకు చేరుకుంది. నగర పంచాయతీ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో తాడుకి ద్రాక్ష పండ్ల గుత్తులను కట్టి, వాటి వంక చూస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఐదు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసిన వారిని పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కనీస వేతనం అమలు చేయాలని, జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అత్యవసర విభాగాలైన విద్యుత్, తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులను వారు నిలుపుదల చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు వనచర్ల విజయ్‌కుమార్, న్యాయవాదులు దోనిపాటి ఆంజనేయులు వడ్డి నాగే శ్వరరావు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. సమ్మెలో ఎం.శ్రీనివాసరావు, ఎస్.అరుణకుమార్, వి.వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటేష్, కాశి రాంబాబు, బి.లోవరాజు, ఎం.భార్గవ్, నాగలక్ష్మి, వెంకటలక్ష్మి, బి.శ్రీను, వై.రమణ, ఎస్.రామరాజు, లక్ష్మి, అర్జావతి తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా పోలవరం గ్రామసభ

కూనవరం, జనవరి 4: కూనవరం మండల కేంద్రంలో నిర్వ హించిన పోలవరం గ్రామ సభ రసాభాసగా మారింది. అవార్డు ఎంక్వైరీ సభలో గురువారం క్లస్టరు 1 నుంచి 2 వరకు నిర్వాసి తుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అధికారులు ఇచ్చిన ప త్రాలలో నిర్వాసితులు సంతకం చేసి ఇవ్వాలని తెలిపారు. అయితే ఆ పత్రాలలో ఎంత పరిహారం ఇస్తారో లేకపోవడంతో నిర్వాసితులు సంతకాలు పెట్టడానికి ముందుగా నిరాకరించారు. పరిహారం ఎంత వస్తుందో తెలియకుండా సంతకాలు పెట్టలే మంటూ నిర్వాసితుల పక్షాన టీడీపీ, జనసేన, సీపీఎం నాయ కులు గట్టిగా పట్టుబట్టారు. దీంతో అధికార వైసీపీ నాయకు లకు-ప్రతిపక్ష నాయకులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. చివరికి అధికారులు జోక్యం చేసుకుని ఎవరికైనా అభ్యంతరం ఉంటే సంతకాలు చేయవద్దని, అభ్యంతరం లేనివారు సంతకాలు చేయవచ్చంటూ నిర్వాసితులకు తెలిపారు. కొంతమంది సంతకాలు చేయకుండా సభ నుంచి వెళ్లిపోగా మరికొంతమంది సంతకాలు పెట్టి పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ అరకు అధికార ప్రతినిధి యడవెల్లి భాస్కరరావు, సీపీఎం నాయకులు నాగరాజు, టీడీపీ మండలం అధ్యక్షుడు బరబాటి ప్రకాష్, జనసే న నాయకులు, కూనవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ హేమం త్‌గాంధీ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బండారు సాంబశివ రావు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం

సెక్టార్ అధికారులతో పీవో సమీక్ష


సమీక్షలో మాట్లాడుతున్న పీవో

రంపచోడవరం, జనవరి 4: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా సెక్టార్ అధికారులు తొలుత బూత్‌లకు సంబంధించిన రూట్లను పరిశీలించుకోవాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్‌తో కలిసి పోలింగ్ బూత్‌లలో మౌలిక సదుపాయాలు కల్పనపై సెక్టారు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నియమ నిబంధనలు హ్యాండ్‌బుక్‌లో పొందుపర్చాలని సెక్టారు అధికారులను ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన నివేదికలు సకాలంలో అందివ్వకుంటే శాఖాపరమైన చర్యలుంటాయని చెప్పారు. ఎన్నికల డీటీ ఎన్వీ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ టి.లక్ష్మణ్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు తక్షణం చేపట్టాలి


ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

రంపచోడవరం, జనవరి 4: మండలంలోని కన్నారం-వెలగపల్లి రోడ్డు పనులు త్వరితగతిన ప్రారంభించాలని భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు జుత్తు కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక జూనియర్ కళాశాల నుంచి కార్యకర్తలతో ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ కన్నారం-వెలగపల్లి మార్గాన సుమారు ఐదు గ్రామాలు ఉన్నాయని, సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఆసుపత్రులకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా నిధులు మంజూరై నాలుగేళ్లు అయినా నేటికి పనులు ప్రారంభించకుండా గి రిజన సంక్షేమ శాఖ అధికారులు జాప్యం చేస్తూ ప్రజా సమస్యలపై బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే కన్నారం-వెలగపల్లి, వెలగపల్లి-గెంపెనపల్లి వాగుకు బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు బాల్‌దొర, కామేశ్వరరావు, సత్తిబాబు, బాబి, నరసన్న, రామన్న తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ లబ్ధిదారుల అవస్థలు


కుర్చీలు లేకపోవడంతో నిల్చునే ఉన్న వృద్ధులు

రాజవొమ్మంగి జనవరి 4: రాజవొమ్మంగిలో గురువారం నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధన లక్ష్మి హాజరై నూతన పింఛన్లు పంపిణీ చేశారు. అయితే మండలంలో 75 నూతన పింఛన్లు మంజూరైతే కార్యక్రమానికి వందలాది మంది హాజరయ్యారు. గురువారం జరగనున్న సమావేశంలోనే అందరికీ పింఛన్ ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇస్తారంటూ జోరుగా ప్రచారం జరగడంతో పింఛన్ తీసుకునేందుకు అధిక సంఖ్యలో లబ్ధిదారులు హాజరయ్యారు. అయితే చాలా మంది వృద్ధులు, మహిళలకు సమావేశ ప్రాంగణంలో కుర్చీలు లేక నిలబడే ఎదురుచూశారు. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల రూ.3000 ఇస్తున్నామని, ఈ నెల పింఛన్ సొమ్ములు కూడా వలంటీర్ మీ ఇంటికే తెచ్చిస్తారు అని చెప్పడంతో లబ్ధిదారులు నిరాశతో వెనుదిరిగారు. జన సమీకరణ కోసం పింఛన్లు ఇస్తున్నారని ప్రచారం చేసి వృద్ధులను ఇళ్ల నుంచి రప్పించారని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ విమర్శించారు.

శ్రీరాముని విలాసోత్సవం



ఎటపాక, జనవరి 4: వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా గురువారం భద్రాద్రి రామయ్యకు పురుషోత్తపట్నంలోని శ్రీ గోకులరామంలో వన విహార మండపంలో విలాసోత్సవం వైభవంగా నిర్వహించారు. రామయ్యను కల్ప వృక్షంపై మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చారు. విలాసోత్సవం సందర్భంగా శ్రీరామ నాట్యాలయం వారి ఆధ్వర్యంలో కూచిపుడి, భరతనాట్యంతో పాటు శాస్త్రీయ నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక



ఎటపాక, జనవరి 4:జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు నల్లకుంట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సోడి నాగిరెడ్డి ఎంపికయ్యారు. గతనెల 31న తెలంగాణలో నిర్వహించిన 10వ నేషనల్ రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ స్టేట్ చాంపియన్‌షిప్‌లో 45 సంవత్సరాల విభాగంలో షాట్‌పుట్ 10 మీటర్లు, 100 మీటర్ల పరుగు పందెంతో పాటు జావెలిన్ త్రో 36 మీటర్ల పందెంలో ప్రతిభ కనబరిచి మూడు గోల్డ్ మెడల్స్ సాధించారు. దీంతో ఆయన వచ్చే నెల ఫిబ్రవరి 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే జాతీయ స్థాయి మాస్టర్‌అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నారు.

జాతీయ స్థాయి కబడ్డీలో ప్రతిభ

మోతుగూడెం, జనవరి 4: ఢిల్లీ ఘజియాబాద్ స్టేడియంలో గురువారం జరిగిన జాతీయ స్థాయి అండర్-14 కబడ్డీ పోటీల్లో మోతుగూడెం డీఏవీ పాఠశాల బాలికలు ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్స్ సాధించారు. చింతూరు మండలం మోతుగూడెంలో ఏపీ జెన్కో డీఏవీ పాఠశాల విద్యార్థులు గత నెల డిసెంబర్‌లో పాల్వంచలో జరిగిన క్లస్టర్ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచారు. అక్కడ నుంచి అదే నెలలో జోనల్ స్థాయిలో హైదరాబాద్‌లో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచారు. వారిలో ఎం.లాలస సంయుక్త, కె.స్పందన, సీహెచ్ వెంకట అక్షయ, హారిక, సుదీప్తి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఢిల్లీలో జరిగిన ఈ పోటీల్లో విద్యార్థుల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. విద్యార్థుల వెంట పీటీ భద్రయ్య, ఎస్కార్ట్ టీచర్ రజనీ ఉన్నారు. వారిని డీఏవీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రఘురాం, సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ ఎల్ఎంసీ చైర్మన్ బొడ్డడ శ్రీధర్, ప్లాంట్ మేనేజర్ భీమవరం బాలకృష్ణ, డీఈటీ వరప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, మోతుగూడెం ఎస్ఐ బి.గోపాలరావు, మోతుగూడెం సర్పంచ్ ఆకేటి సీత, ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, సీలేరు ఏపీ జెన్కో స్పోర్ట్స్ సెక్రటరీ సతీష్ రాఘవన్, ఏపీ జెన్కో ఉద్యోగస్తులు, మోతుగూడెం గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.


ప్రతిభ చాటిన విద్యార్థులతో పీటీ, ఎస్కార్ట్ టీచర్

రైతుబజార్‌లో ఉచిత వైద్య పరీక్షలు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 4 : రాజమహేంద్రవరం నటరాజ్ సెంటర్ రైతు బజార్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డెల్టా ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 60 మందికి బీపీ, షుగర్, వైద్య పరీక్షలను ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఉచితంగా అందించారు. జిల్లా అగ్రిట్రేడ్ మార్కెటింగ్ అధికారి సునీల్ వినయ్ అనుమతితో వైద్య శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. రైతు బజార్‌లోని రైతులతో పాటు ఇతర వ్యాపారులు వైద్యసేవలు పొందారని రైతుబజార్ ఎస్టేట్ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.

ఆడుదాం ఆంధ్రా పేరుతో యువతకు ద్రోహం

- పబ్లిసిటీ పీక్.. డవలప్ మెంట్ వీక్
- టీడీపీ నేత ఆదిరెడ్డి, జనసేన నేత అనుశ్రీ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 4: స్టేడియం నిర్మాణాలులేకుండా, క్రీడాకారులకు సౌకర్యాలు లేకుండా రాష్ట్రవ్యాప్తంగా జగన్ ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా అంటూ యువతను దారుణంగా మోసం చేస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల రన్నింగ్ ట్రాక్ వద్ద గురువారం విలేకరులతో మాట్లాడారు. రాజమహేంద్రవరంలో క్రీడా స్టేడియంలు, క్రీడా మైదానాలు నిర్మించకుండా గాలికొదిలేసి ఈ రోజు ఆడుదాం ఆంధ్రా అని మరొక స్కామ్‌లకు తెరలేపారన్నారు. వేసవి కాలంలో నిర్వహించాల్సిన క్రీడలు ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో ఆగమేఘాలపై నిర్వహించి యువతను మోసంచేసే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఆడుదాం ఆంధ్రాకు 345 మంది స్పోర్ట్స్‌మెన్‌లు బ్రాండ్ అంబాసిడర్‌లుగా వస్తున్నారని చెప్పడమే తప్ప అంబటి రాయుడు మినహ ఎవరూ కనిపించడం లేదన్నారు. దానవాయిపేట పార్కువద్ద స్కేటింగ్, స్విమ్మింగ్ పూల్ వంటివన్నీ టీడీపీ హయాంలో చేసినవేనని చెప్పారు. మునిసిపల్ గ్రౌండ్ కూడా గుడా నిధులతో గన్నికృష్ణ హయాంలో కార్పొరేషన్ చేసిందని, ఆర్ట్స్ కళాశాల ట్రాక్ నిర్మాణం కూడా అప్పటి శాప్ డైరెక్టర్ యర్రా వేణుగోపాలరాయుడు సహకారంతో నిర్మించారని చెప్పారు. సోదరుడు ఎంపీ భరత్ 100 రోజుల్లో స్టేడియంలు కట్టేస్తామని చెప్పారని.. అలాంటి వంద రోజులు ఎన్నో వెళ్లిపోయాయన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆదిరెడ్డి శ్రీనివాస్

టీడీపీ హయాంలో క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. రేపు టీడీపీ జనసేన అధికారంలోకి రాగానే ఒక అద్భుతమైన మల్టీపర్పస్ స్టేడియం నిర్మాణం చేస్తామని చెప్పారు. నగరంలో ఎవ్వరిని సంప్రదించకుండా ఏకపక్ష నిర్ణయాలతో ఎంపీ భరత్ చేసిన పనులవల్ల సమస్యలు ఎదురవుతున్నాయని మండిపడ్డారు. ఎంపీ పబ్లిసిటీ పీక్, డవలప్‌మెంట్ వీక్ అని విమర్శించారు. జనసేన నేత అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ తల్లిని చెల్లిని ఇంట్లోంచి బయటకు గెంటేసిన జగన్ ఈ రోజు కాకినాడ వచ్చి తన కుటుంబాన్ని విడగొడుతున్నారని మొసలి కన్నీరు కారుస్తున్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాస్, నగర ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకి రామయ్య, మాజీ కార్పొరేటర్లు కోరుమిల్లి విజయశేఖర్, యిన్నమూరి రాంబాబు, కిలపర్తి శ్రీనివాస్, కోసూరి చండీప్రియ, కప్పల వెలుగు కుమారి, పార్లమెంట్ కమిటీ కార్యదర్శులు బంగారు నాగేశ్వరరావు, మహబూబ్ ఖాన్, మిస్కా జోగినాయుడు, రుంకాని విజయ్, కంటిపూడి రాజేంద్రప్రసాద్, జక్కంపూడి అర్జున్ పాల్గొన్నారు.

చలో ఆచంట కార్యక్రమాన్ని విజయవంతం చేయండి : మాజీ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, జనవరి 4: ఈనెల 7న భీమవరం నియోజకవర్గం ఆచంటలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, భీమవరం టీడీపీ పరిశీలకుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. చంద్రబాబు పర్యటనలో భాగంగా గురువారం నిర్వహించిన భీమవరం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పశ్చిమగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షురాలు, రా జ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతామహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులను బదిలీలు చేసినట్టుగా ఎమ్మెల్యేను బదిలీ చేయడం ఏపీలోనే చూస్తున్నామని అన్నారు. గెలుపుపై నమ్మకం పోవడంతోనే జగన్‌రెడ్డి మార్పులు చేసుకుంటున్నారని అన్నారు. కాకినాడ సభలో ఆయన మాట్లాడుతూ నా కుటుంబంలో చిచ్చు పెట్టారని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కుటుంబ సభ్యులను వాడుకుని వదిలేసిన ఘనత జగన్‌రెడ్డిదని అన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే తిరుగుబాటు చేసే పరిస్థితి వైసీపీలో ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వర రావు, నల్లమిల్లి సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


బలభద్రపురంలోని శ్రీదేవి, భూదేవి, సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం, ఇన్‌సెట్‌లో మల్లిడి గంగారెడ్డి, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు

బిక్కవోలు, జనవరి 4: తూర్పు తిరుమలగా పేరొందిన బలభద్రపురంలో నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి స్వామి, అమ్మవార్లకు ఈనెల 13 వరకూ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ తిరుమలలో వలే ఇక్కడ స్వామివారి ఆలయంతోపాటు వరహాస్వామి, కోనేరు, కోనేటిలో సుదర్శనమూర్తి ఆలయాలు నిర్మించామన్నారు. స్వామిని దీపాల వెలుగుల్లోనే దర్శనం కల్పిస్తామని తెలిపారు. ఈ ఏడాది నుంచి ప్రతియేటా స్వామి, అమ్మవార్లకు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా రూ.25 లక్షలతో విష్వక్సేన, శేష, గరుడ, హనుమద్, అశ్వ, కల్పవృక్ష, హంస, గజ, సింహ వాహనాలను తయారు చేయించామన్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజు స్వామి, అమ్మవార్లను ఒక్కో వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల్లో స్వామి దర్శనానికి వచ్చే భక్తులందరికీ అన్నదాన ఏర్పాట్లు చేశామన్నారు.


గ్రామోత్సవానికి ఏర్పాటు చేసే వాహనాలు

కోరుకొండలో జనసేన మహా పాదయాత్ర


కోరుకొండలో జనసేన మహాపాదయాత్ర నిర్వహిస్తున్న బత్తుల వెంకటలక్ష్మి

కోరుకొండ, జనవరి4: కోరుకొండలో జనసేన పార్టీ మహిళా సాధికార కమిటీ కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి గురువారం సాయంత్రం కోరుకొండలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి జనసేన పార్టీ సిద్ధాంతాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలు అందజేశారు. కీచైన్, ప్యాకెట్ బ్యాడ్జీలు, బొట్టుబిళ్ళ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తోట ప్రత్యూషదేవి, బత్తుల వందనాంబిక, జనసేన పార్టీ నాయకులు దేవర దుర్గాప్రసాద్, యర్రంశెట్టి పోలారావు, బదిరెడ్డి దొర, సీతారాం పాల్గొన్నారు.

అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు పంపిణీ


కొంకుదురులో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు పంచుతున్న ధర్మప్రచార సమితి సభ్యులు

బిక్కవోలు, జనవరి 4: అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ నుంచి వచ్చిన శ్రీరామచంద్రుని దివ్య అక్షింతలను గురువారం కొంకుదురు గ్రామంలో హిందూ ధర్మ ప్రచార సమితి సభ్యులు ఇంటింటా పంపిణీ చేశారు. హిందువుల శతాబ్దాల కలైన రామ జన్మభూమిలో ఈనెల 22న మందిర ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరుగుతున్నందున ఆరోజున పండుగలా చేసుకోవాలని సమితి సభ్యులు గ్రామస్థులకు సూచించారు.

సీతానగరం : అయోధ్యరాముని అక్షింతలను బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి ఆధ్వర్యంలో కాటవరం గ్రామవీధులలో పల్లకీలో ఊరేగిస్తూ ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు.గూడపాటి జయరామ్, బూరుగుపల్లి బంగారయ్య, సమరసత ఫౌండేషన్ డివిజన్ ఇన్ చార్జి మల్లేశ్వరరావు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

అధికారుల హామీలను విస్మరించి యథేచ్ఛగా ఇసుక రవాణా

సీతానగరం, జనవరి 4: మునికూడలి ఇసుక ర్యాంపునుంచి అక్రమంగా నిర్భయంగా ఇసుక తవ్వకాలను సాగిపోతున్నాయి. యథేచ్ఛగా రాత్రింబవళ్లు ఇసుక డంపింగ్ చేస్తూ రైతుల పట్టాభూములలో అనుమతులు లేకుండా తవ్వేస్తున్నారు. బుధవారం తెలుగుదేశం రాజానగరం ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ ఆధ్వర్యంలో రైతులు , తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు అక్రమ ఇసుక తవ్వకాలు ఆపాలని ర్యాంపు వద్ద బైఠాయించి ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. పోలీసులు గుత్తేదారులతో సంప్రదించి, ఇరు వర్గాలతో చర్చించి మూడు రోజులు వరకు ఇసుక రవాణా నిలిపివేయడానికి నిర్ణయించడంతో ఆందోళన విరమించారు. అయితే గురువారం మధ్యాహ్నం నుంచి యథాతథంగా ఇసుక రవాణా ప్రారంభించేశారు. దీంతో రైతులు అయోమయంలో పడ్డారు. ఈ విషయమై సీతానగరం ఎస్ఐ చిరంజీవిని వివరణ కోరగా వారికి అన్ని అనుమతులు తీసుకువచ్చారని అందుచేత డంపింగ్ ప్రారంభించారని తెలిపారు. అయితే పట్టిభూముల పరిస్థితి ఏమిటని అడుగగా ఆ విషయం మాకు తెలియదని సీతానగరం తహసీల్దార్‌ను అడగాలని తెలిపారు. ఈ విషయమై సీతానగరం తహసీల్దార్ పొగిరి కృష్ణారావును వివరణ కోరగా సర్వే చేయమని నాకు ఎవ్వరూ చెప్పలేదని, రైతులు వచ్చి సర్వే చేయమని దరఖాస్తు చేసుకుంటే సర్వేచేసి భూములు చూపిస్తామన్నారు.

ఆడపిల్లల్ని కాపాడుదాం


కడియం: విజేతలుగా నిలిచిన విద్యార్థులు... అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కడియం, జనవరి 4: ఆడపిల్లలను రక్షించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, సమాజంపై ఉందని ఎంఈవో నాగేశ్వరరావు తెలిపారు. కడియం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన మండలస్థాయిలో బాలికాసంరక్షణా దినోత్సవ కార్యక్రమం జరిగింది. మండలంలో ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి సత్యనారాయణ, షేక్ ఇమాం, ప్రసన్నకుమారి, సువర్ణవేణి, కె రాజు తదితరులు పాల్గొన్నారు.

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ క్లబ్ ప్రారంభం

సీతానగరం, జనవరి 4 : మండలంలోని బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ క్లబ్ ప్రారంభమైందని ప్రధానోపాధ్యాయులు కోలా సత్యనారాయణ తెలిపారు. గురువారం హైస్కూల్‌కు కేంద్ర ప్రభుత్వ వినియోగ వ్యవహారాల మంత్రిత్వశాఖ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ క్లబ్‌ను మంజూరు చేశారని తెలిపారు. ఈ క్లబ్ ద్వారా పాఠశాల విద్యార్థులలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ కార్యక్రమం పైన వస్తువుల స్వచ్ఛత ప్రమాణాలను తెలుసుకోవడానికి అనుసరించాల్సిన విధానాలపైన పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామ న్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు

బూత్ కమిటీల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కోరుకొండ, జనవరి 4: గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమా న్ని ప్రజలకు వివరిస్తూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఓ సైన్యంలా పనిచేయాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. గురువారం ఆయన కోరుకొండ, శ్రీరంగపట్నం, కోటి గ్రా మాల్లో ముఖ్యమైన నాయకులతో సమావేశమయ్యారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ గెలుపుకు కృషి చేయాలన్నారు. రెండు గ్రామాల్లోను విడివిడిగా ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. సమావేశంలో జడ్పీటీసీ కర్రి నాగేశ్వర రావు, వైసీపీ నాయకులు గణేశుల పోసియ్య, సూరిశెట్టి భ ద్రం, కుటుంబరావు, అత్తిలి రాంప్రసాద్, దాడి రాంబాబు పాల్గొన్నారు.

పెంచిన పింఛన్లు పంపిణీ

బిక్కవోలు, జనవరి 4: పెంచిన రూ.3వేల పింఛన్లను ఎమ్మెల్యే గురువారం బిక్కవోలు, కొంకుదురు, ఊలపల్లి, పందలపాక గ్రామాల్లో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పీటీసీ రొంగల పద్మావతి, ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, వైస్ ఎంపీపీలు బుద్దాల కన్నారావుయాదవ్, పెంకే మంగయ్యమ్మ, సర్పంచ్, ఉపసర్పంచ్‌లు సరెళ్ల సుమలత, జంగా మురళీకృష్ణారెడ్డి, బుంగా రామారావు, బండారు రమ్య, మండల కన్వీనర్ పోతుల ప్రసాదరెడ్డి, ఎంపీడీవో జేఏ ఝాన్సీ పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో 18 ఎకరాల చెరకుతోట దగ్ధం

గోపాలపురం, జనవరి 4: మండలంలోని తొక్కిరె డ్డిగూడెం సమీపంలో గురువారం జరిగిన అగ్నిప్రమా దంలో సుమారు 18ఎకరాల చెరకుతోట దగ్ధమైంది. గోపాలపురం గ్రామానికి చెందిన రైతు భాస్కరరావు చెరకుతోటపై ఉన్న విద్యుత్ తీగల నుంచి మంటలు రావడంతో చెరకుతోటకు నిప్పంటుకుందని రైతు భాస్కరరావు తెలిపారు. సుమారు 20ఎకరాల చెరకు పంట చేతికి వచ్చే సమయంలో 18 ఎకరాలు కాలి పోగా 2ఎకరాలు మాత్రమే మిగిలిందన్నారు. పరిసర ప్రాంత రైతుల సమాచారంతో జంగారెడ్డిగూడెం నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపుచేసే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ చాలా వరకు చెరకుతోట కాలిపోయిందన్నారు.

రెండో రోజుకు పారిశుధ్య కార్మికుల సమ్మె

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 4: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె గురువారం రెండో రోజుకు చేరింది. ఆందోళనలో భాగంగా రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయం వద్ద మునిసిపల్ కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కోరుమామిళ్ళ సుబ్బారాయుడు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా న్యాయమైన సమస్యల పరిష్కారానికి మునిసిపల్ కార్మికులు సమ్మె నిర్వహిస్తుంటే ఆ సమస్యలను పరిష్కరించాల్సిందిపోయి వైసీపీ సర్కార్ మరింత రెచ్చగొడుతుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 45 వేల మంది మునిసిపల్ కార్మికులు శాంతియుతంగా సమ్మెచేస్తున్నారన్నారు. రాజమహేంద్రవరంలో ఇద్దరు మునిసిపల్ కార్మికులకు అధికారులు షోకాజ్ నోటీస్ ఇచ్చి భయపెట్టాలని చూస్తున్నారన్నారు.యూనియన్ గౌరవ అధ్యక్షుడు తాటిపాక మధు , ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కుండ్రపు రాంబాబు మాట్లాడుతూ 32 ఏళ్లు పనిచేసిన కార్మికులకు గ్రాట్యుటీ ఇమ్మని అడుగుతుంటే జగన్ తన సొంత ఆస్తిని అడుగుతున్నట్టు కుదరదనడం దారుణమన్నారు. సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె ఆగదని స్పష్టం చేశారు. నగరంలో పారిశుధ్య పనులు చేసే సొసైటీ కార్మికులు సమ్మెలోకి వెళ్ల డంతో పలు ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతుంది.

ఓపెన్ ఎయిర్ థియేటర్ పనుల పరిశీలన

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 4: సుబ్రహ్మణ్య మైదానంలో జరుగుతున్న ఓపెన్ ఎయిర్ థియేటర్ పనులు గురువారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ సందర్శించారు. సాంస్కృతిక ప్రదర్శనలకు సభలకు ఓపెన్ ఎయిర్ థియేటర్ ప్రజలకు తక్కువ ధరలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకి రామయ్య, మళ్ళ వెంకట్రాజు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన ఆదిరెడ్డి



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 4: జయహో బీసీ సభకు వెళ్లిన రాజమహేంద్రవరం మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ సీనియర్ నేత ఆదిరెడ్డి అప్పారావు టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంపై పలు అంశాలు వివరించినట్టు తెలిపారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు బాబును కలిశారు.

అంధుల పాఠశాల విద్యార్థులకు పరామర్శ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 4: రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి పక్కనే ఉన్న జీయోన్ అంధుల పాఠశాల విద్యార్థులను బలవంగా ఖాళీ చేయించి కోటిపల్లి బస్టాండ్ వద్ద బాలికల వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర విభిన్నప్రతిభావంతులు సంస్థ మాజీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గోనుగుంట్ల కోటేశ్వరరావు అక్కడకు వెళ్లి బాధిత విద్యార్థులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగులపై వైసీపీ ప్రభుత్వం దౌర్జన్యం చేసిందన్నారు. కళ్ళు, కాళ్ళు లేని వారిని పోలీసులతో కొట్టించడం దుర్మార్గమన్నారు. ఈ ఘటనపై పోలీసులు, రెవెన్యూ అధికారులపై మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వీరికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట జీయోన్ నిర్వాహకుడు బెన్నిబాబు ఉన్నారు.

రాజకీయాల్లో రౌడీల వల్లే దేశం వెనుకబాటు

- రెండు సీలు తప్పనిసరి అవుతున్నాయి?
- ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు కావొస్తున్నా ఇప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఉండడానికి అక్షరజ్ఞానం లేనివాళ్లు, రౌడీలు, గూండాలు రాజకీయాల్లో రావడమే కారణమని ఎంపీ భరత్‌రామ్ అన్నారు.తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గురువారం ఓ హోటల్‌లో జరిగిన ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్ క్రిస్మస్ వేడుకల హాజరైన ఆయన స్పందించారు. ఇదే విషయంపై తనలో తాను నిరంతరం సంఘర్షణకు గురవుతున్నానని చెప్పారు. రెండు 'సీ'(క్యాష్, క్యాస్ట్)లు తప్పనిసరి కావడం వల్లనే విద్యావంతులు రాజకీయాల్లోకి రావడానికి భయపడుతున్నారన్నారు. సమాజాభి వృద్ధికి, ప్రజ లకు విశేషమైన సేవలు అందించడానికి రాజకీయ రంగం సరైన వేదికగా ఉపయోగపడాలే తప్ప అసహాస్యం కాకూడదన్నారు. విద్యావంతులు రాజకీయాల్లోకి ప్రవేశిస్తేనే ప్రజాస్వామ్యం పదికాలాలపాటు మనగలుగుతుంద న్నారు.

పారిశుధ్యంపై ఇంత నిర్లక్ష్యమా?

- మునిసిపల్ అధికారులపై ఎంపీ ఆగ్రహం

రాజమహేంద్రవరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని అధికారులను ఎంపీ భరత్‌రామ్ హెచ్చరించారు. 45వ వార్డులోని ఓ కార్యక్రమానికి గురువా రం ఎంపీ వెళ్లారు. డ్రైనేజీలో మురుగునీరు నిలిచిపోయి అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బని పిలిచి ఆగ్రహం వ్యక్తం చేశారు. మురుగునీటిని శుద్ధి చేయకుండా గోదావరిలో వదిలేస్తుండడం పెద్ద సమస్యగా మారిందన్నారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు.

పిల్లలు పరిజ్ఞానం పెంచుకోవాలి

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి

రాజమహేంద్రవరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుపై ఆసక్తి కలిగి ఉండడంతో పాటు వివిధ విషయాలపై పరిజ్ఞానం పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. శ్రీ శ్రీనివాస రామనుజన్ మునిసిపల్ హైస్కూల్‌లో 'నల్సా వారి పిల్లలకు స్నేహపూర్వక న్యాయ సేవలు, వారి సం రక్షణ పథకం-2015'పై డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పిల్లల అమాయకత్వాన్ని అవకాశంగా తీసుకొని వారిపై కొందరు అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. పిల్లలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహ నిషేధ చట్టం-2006పై అవగాహన కల్పించారు. పిల్లలతో మాట్లాడి వారి ఇబ్బందులపై ఆరా తీశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ప్రత్యూష కుమారి





ఏం తిని బతకాలి సీఎం గారూ!

మిరిచ్చే జీతానికి గడ్డి తిని బతకాలా! సీఎం గారూ.. వేతనాలు పెంచాలని గురువారం 24వ రోజు కొవ్వూరులో అంగన్‌వాడీలు ఇలా గడ్డి తింటూ నిరసన తెలిపారు. - కొవ్వూరు



తెలుగు మహాసభలకు గైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన భారీ వేదిక

నేటి నుంచే తెలుగు పండుగ

3 రోజుల పాటు నిర్వహణ

రాజానగరం, జనవరి 4 : తెలుగు పండుగకు వేళయింది.. రాజమహేంద్రరం ముస్తాబైంది.తెలుగు భాషా వికాసం కోసం ఆంధ్రమేవ జయతే నినాదంతో మూడు రోజుల పాటు నిర్వహించనున్న 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలకు గైట్ కళాశాల ముస్తాబైంది. చైతన్య విద్యాసంస్థలు, ఆంధ్రసారస్వత పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీరాజరాజనరేంద్రుల పట్టాభిషేక సహస్రాబ్దికి నీరాజనంగా శుక్రవారం నుంచి ఈ తెలుగు మహాసభలు నిర్వహించనున్నారు. ఇందుకోసం గైట్ కళాశాల ప్రాంగణంలో రాజరాజ నరేంద్ర, ఆదికవి నన్నయ, శ్రీనారాయణభట్టు వేదికలను ఏర్పాటు చేశారు. మహాసభల ఏర్పాట్లను చైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకులు కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు), ఆంధ్ర సారస్వత అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ మహాసభలకు జనవరి 5,6,7 తేదీల్లో దాదాపు లక్షా యాభై వేల మంది తెలుగు బాషాభిమానులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే అతిధులు బసచేసేందుకు గైట్ కళాశాలతో పాటు రాజమహేంద్రవరంలోని హోటళ్లలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి.సభలకు హాజరయ్యే అతిథులకు గైట్ కళాశాల ఆతిథ్యం ఇవ్వనుంది. ప్రధాన వేదికైన శ్రీరాజరాజ నరేంద్ర వేదిక సమీపంలోనే దాదాపు 80 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. తొలి రోజైన 5వ తేదీ శుక్రవారం ఉదయం 8.30 గంటలకు సదస్సుల అంకురార్పణ, 9 గంటలకు కవి సమ్మేళన అంకురార్పణ సభ, 10.30 గంటలకు శ్రీరాజరాజ నరేంద్ర వేదికపై మహాసభల ప్రారంభోత్సవం జరుగుతుంది. తెలుగు మహాసభల ప్రారంభోత్సవ సభకు విశాఖ శారదా పీఠం పీఠాదిపతి శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి విచ్చేస్తారు. సాయంత్రం 5 గంటలకు వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రముఖులకు పూర్ణకుంభం పురస్కారాలు ప్రధానం చేస్తారు.అనంతరం అష్టావదానం, పద్యకవితా సదస్సు, గద్య సాహిత్య సదస్సు, అవగాహన సాహిత్య సదస్సు, వాగ్గేయకార సాహిత్య సదస్సు, గజల్ కవి సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు కన్నుల పండువుగా జరగనున్నాయి.



తెలుగు మహాసభలకు ముఖద్వారం

రెండో రోజు ఇలా..

రెండో రోజైన 6న ఉదయం 10.30 గంటలకు కృతజ్ఞత సభకు ముఖ్యఅతిథిగా మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు, విశిష్ట అతిథులు తెలంగాణ ఐటీ పరిశ్రమల మంత్రి దిద్దిళ్ల శ్రీధర్‌బాబు, గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి, సీహెచ్ మానవేందర్‌రాయ్, యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ తదితర ప్రముఖులు హాజరుకానున్నారు. అదో రోజు సాయంత్రం జరిగే తెలుగు తోరణం, నృత్య రూపక ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరుకానున్నారు. భక్తి సాహిత్య సదస్సు, కవిత సాహిత్య సదస్సు, బాల సాహిత్య సదస్సు, పత్రికా సాహిత్య సదస్సు, తెలుగు వైజ్ఞానిక, గేయ సాహిత్యం, కథా సాహిత్య సదస్సు, అంతర్జాల మాధ్యమంగా అంతర్జాతీయ కవి సమ్మేళనం, అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

మూడో రోజు..

చివరి రోజైన 7వ తేదీన జరిగే ఆంధ్రమేవ జయతే సభకు నాగాలాండ్ గవర్నర్ రాగణేషన్ ముఖ్యఅతిథిగా, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వేంకటశేషసాయి విశిష్ట అతిథిగా హాజరుకానున్నారు. గౌరవ అతిథులుగా జేడీ లక్ష్మీనారాయణ, ఎం.కె.రామ్మోహన్ నాయుడు, మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు హాజరు కానున్నారు. సాయంత్రం 5 గంటలకు జరిగే సమాపనోత్సవానికి త్రిపుర గవర్నర్ ఎం.ఇంద్రసేనారెడ్డి,విశిష్ట అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి యు.దుర్గాప్రసాదరావు హాజరుకానున్నారు. ఆకాశ వాణి, దూరదర్శన్ బుల్లి తెరలలో తెలుగు వికాసం సదస్సు, ప్రవాంధ్రుల సాహితీ తపస్సు సదస్సు, ఆధునిక సాహిత్య సదస్సు, ప్రదర్శనాత్మక సాహిత్య సదస్సు, హాస్య వ్యంగ్య, చమత్కార సాహిత్య సదస్సు, చలనచిత్ర సాహిత్య సదస్సులు జరగనున్నాయి.

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో.. రేపు రాజమహేంద్రవరంలో ముత్యాల ముగ్గుల పోటీలు

రాజమహేంద్రవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏడాది వచ్చినట్టే ఈ ఏడాది ముగ్గుల పండుగ వచ్చేసింది.. మహిళాలోకానికి బహుమతులు విందు చేయనుంది.రాజమహేంద్రవరం పట్టణం జేఎస్ రోడ్డులో రిలయన్స్ డిజిటల్ ఎదురుగా ఉన్న షిర్డీసాయి జూనియర్ కాలేజీ ఆవరణలో "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" ఈ నెల 6న శనివారం జరగనున్నాయి.ఉదయం 9 గంటలకు ముత్యాల ముగ్గుల పోటీలు ప్రారంభమవుతాయి.జిల్లా పోటీలకు స్పాన్సరర్‌గా రాజమహేంద్రవరానికి చెందిన భవానీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవహరిస్తోంది. విజేతలైన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలవారికి రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు చొప్పున నగదు బహుమతులు ఉంటాయి. పోటీల్లో పాల్గొనే మహి ళలు పేర్లు నమోదుకు 99854 11248 నెంబర్‌లో సంప్రదించగలరు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి మహిళలు పాల్గొనవచ్చు.





వైసీపీ వదిలేసింది.. కేంద్రం దారి చూపింది!

నిడదవోలు ఆర్‌వోబీ నిర్మాణంపై కదలిక

- పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- ఎట్టకేలకు కదిలించిన కేంద్రం
- సేతుబంధన నిధులతో నిర్మాణం
- సంక్రాంతి తరువాత పనులు ఆరంభం
- తీరనున్న గోదావరివాసుల కల

నిడదవోలు, జనవరి 4 : నిడదవోలు పట్టణ నడిబొడ్డులో 2019జనవరి 7న ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించి పైలాన్ ఆవిష్కరించి 18 నెలల్లో ఆర్వోబీ నిర్మాణం పూర్తి కావాలని నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు ఆదేశించారు.ఇది జరిగి ఐదేళ్లవుతోంది..నాడు ఎంత పని చేశారో నేటికీ అంతే..ఎందుకంటే వైసీపీ ప్రభుత్వంలో కనీసం కదలిక లేదు.చంద్రబాబు ఆశయమూ నెరవేరలేదు..ఈ బ్రిడ్జి నిర్మాణంపై ఎట్టకేలకు కదలిక వచ్చింది.. వైసీపీ ప్రభుత్వం గాలి కొదిలేసినా..కేంద్ర ప్రభుత్వం మాత్రం గోదావరి జిల్లావాసులకు సంక్రాంతి పండుగకు పెద్ద కానుక ఇస్తోంది.

నాడు టీడీపీ హయాంలో శ్రీకారం..

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిడదవోలు పట్టణంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నాడు ఎమ్మెల్యేగా ఉన్న బూరుగుపల్లి శేషారావు నిడదవోలు నెహ్రూబొమ్మ సెంటరులో ఉన్న రైల్వే గేటు స్థానంలో ఆర్వోబీ నిర్మాణానికి పాటుపడ్డారు. నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిడదవోలు గాంధీ బొమ్మ సెంటరులో ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించి పైలాన్ కూడా ఆవిష్కరించారు. అనంతరం ఎన్నికలు రావడం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రివర్స్ టెండరింగ్ ప్రక్రియలో ఆర్వోబీ నిర్మాణ ప్రారంభం గాలికి కొట్టుకుపోయింది. నాలుగున్నరేళ్లుగా ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని గాలికొదిలేశారు. ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి ఆ ఆలోచనే లేదు. నిడదవోలుకు రెండు సార్లు సీఎం జగన్ వచ్చినా కనీసం పట్టించుకోలేదు. స్థానిక వైసీపీ నాయకులు ఆ దిశగా చేపట్టిన చర్యలు శూన్యం. ఇదిలా ఉండగా నిడదవోలు ఆర్‌వోబీ నిర్మాణంపై కేంద్రం స్పందించింది. సేతుబంధన్ స్కీమ్ ద్వారా ఆర్వోబీ నిర్మాణానికి ప్రతిపాదించిన నిధులు మంజూరు చేసింది.ఇప్పటికే ఆర్వోబీ నిర్మాణ స్థల సేకరణకు సంబంధించి స్థల యజమానులకు సొమ్ములు వారి ఖాతాలకు జమయ్యాయి. దీనిపై గతంలోనే ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది.కేంద్ర ప్రభుత్వ నిధులతో ఆర్వోబీ నిర్మాణానికి పిలిచిన టెండర్లకు కాంట్రాక్టర్ రావడం టెండర్ ఖరారు కావడం జరిగింది.దీంతో ఆర్వోబీ కనస్ట్రక్షన్ కంపెనీ రంగంలోకి దిగింది. సంక్రాంతి పండుగ తరువాత ఆర్వోబీ నిర్మాణ పనులు వేగవంతం కానున్నాయి. నాడు తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో రైల్వేగేటు స్థానంలో ఆర్వోబీ నిర్మాణానికి ఏ డిజైన్ అయితే ఖరారు చేశారో ఇప్పుడు అదే డిజైను యథావిధిగా నిర్మాణం జరుగనున్నట్టు సమాచారం. దీంతో ఉభయ గోదావరి జిల్లాల వాహనదారుల ప్రధాన సమస్య అతి త్వరలోనే తీరనుంది.

ఆర్వోబీకి కేటాయించిన నిధుల వివరాలు

ఆర్వోబీ నిర్మాణం వ్యయ అంచనా	రూ.201 కోట్లు
భూసేకరణకు	రూ. 21 కోట్లు
సేతుబంధన్ నిధులు	రూ.124 కోట్లు
కేంద్ర రైల్వే శాఖ వాటా	రూ.56 కోట్లు
భూ సేకరణ వివరాలు	6.14 ఎకరాలు
ప్రభుత్వ భూమి	5.11 ఎకరాలు
ప్రైవేటు భూమి	1.03 ఎకరాలు
స్థల యజమానులు	51 మంది



మునిసిపల్ ఆర్‌జేడీ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న మునిసిపల్ కార్మికులు

జిల్లాలో 1046 మంది సమ్మె

కొవ్వూరులో పారిశుధ్యం పరిశీలించిన ఆర్‌జేడీ

కొవ్వూరు, జనవరి 4 : సమాన పనికి సమాన వేతనం రూ. 26 వేలు అందించాలని మునిసిపల్ కార్మికులు రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎస్‌వీవీ సత్యనారాయణకు గురువారం వినతిపత్రం అందజేశారు. మునిసిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మె నేపథ్యంలో కొవ్వూరు మునిసిపాలిటీని గురువారం ఆర్‌జేడీ ఆకస్మిక తనిఖీ చేశారు. పట్టణంలో పారిశుధ్యం పరిశీలించి మునిసిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ చాంబర్‌లో ఆర్‌జేడీ సత్యనారాయణ మాట్లాడుతూ మునిసిపల్ కార్మికుల డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం, అధికారులు సానుకూలంగా ఉన్నారని..కార్మికులు సహకరించాలన్నారు. జిల్లాలో 1046 మంది మునిసిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులు సమ్మె బాటపట్టారన్నారు. రాజమహేంద్రవరంలో 767, నిడదవోలులో 91, కొవ్వూరు మునిసిపాలిటీలో 98 మంది కార్మికులు సమ్మెలోకి వెళ్లారన్నారు. అయినప్పటికీ పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణలో ఎటువంటి సమస్య తలెత్తకుండా పర్మినెంటు కార్మికులతో పనులు చేయిస్తూ ప్రజలకు సేవలు అందజేస్తున్నామన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరుపుతుందని, ఇప్పటికే కొన్ని డిమాండ్లు పరిష్కరించడం జరిగిందన్నారు. మిగిలిన డిమాండ్ల పరిష్కారానికి ఫైనాన్స్ డిపార్టుమెంటుతో చర్చలు జరుగుతున్నాయన్నారు. ఒకటి, రెండు రోజులలో చర్చలు ఫలించి కార్మికులు సమ్మె నుంచి విధుల్లోకి చేరతారన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో సమ్మెలోకి వెళ్లిన కార్మికులు తిరిగి విధుల్లో చేరారన్నారు. నరసాపురంలో ఔట్ సోర్సింగ్ కార్మికులకు మద్దతుగా సమ్మె చేపట్టిన పర్మినెంటు కార్మికులు సమ్మె విరమించి విధుల్లో చేరడం జరిగిందన్నారు. కొవ్వూరులో గత నెల 27వ తేదీ నుంచి మునిసిపల్ కార్మికులు సమ్మెలో ఉన్నారు. రాజమహేంద్రవరం, నిడదవోలులో మాత్రం బుధవారం నుంచి సమ్మెలో దిగారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు కమిషనర్ బి. శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఈవీఎంలు, వీవీ ప్యాట్లపై అవగాహన కల్పించాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం, జనవరి4(ఆంధ్రజ్యోతి) : భారత ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓటు హక్కు వినియోగాన్ని అత్యంత పారదర్శకంగా ఉండే విధంగా కంట్రోలు యూనిట్స్‌లు, ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు ప్రవేశపెట్టారని జిల్లా కలెక్టర్ డా. కె.మాధవీలత తెలిపారు.కలెక్టరేట్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద గురువారం ఏర్పాటు చేసిన ఓటరు హెల్ప్ డెస్క్‌లో ఎలక్ట్రానిక్ యూనిట్ల ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. ఈవీఎంలు, వీవీప్యాట్లపై ప్రతి ఓటరుకు అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టామన్నారు. ఓటర్లు, అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించే నిమిత్తం నమూనా యూనిట్ల ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎన్.తేజ్‌భరత్,డీఆర్‌వో నరసింహం, డీపీవో జె.సత్యనారాయణ, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కెఎస్.జ్యోతి, కేఆర్‌ఆర్సీ డిప్యూటీ కలెక్టర్ కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

జైభారత్ పార్టీ జిల్లా సమన్వయకర్తగా జువ్విరెడ్డి



కొవ్వూరు, జనవరి 4 : జేడీ లక్ష్మీనారాయణ నూతనంగా స్థాపించిన జై భారత్ నేషనల్‌పార్టీ తూర్పుగోదావరి జిల్లా సమన్వయకర్తగా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామానికి చెందిన జువ్విరెడ్డి హనుమంత వరప్రసాద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. వరప్రసాద్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.



రామన్నపాలెంలో గ్రామకమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మద్దిపాటి వెంకట్రాజు

వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలి

దేవరపల్లి, జనవరి 4: వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడేరోజులు దగ్గర్లో ఉన్నాయని టీడీపీ విజయదుందుభీ మోగిస్తోందని గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మద్దిపా టి వెంకట్రాజు అన్నారు. దేవరపల్లి మండలం రామన్న పాలెం, ధూమంతనగూడెం గ్రామంలో గురువారం సాయ ంత్రం గ్రామకమిటీ సమావే శాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మద్దిపాటి మాట్లాడుతూ వైసీపీ ఈ దాచుకోవడం దోచుకోవడం తప్ప నాలుగున్నర సంవత్సరాల్లో అభివృద్ధి శూన్య మన్నారు. జనసేన, టీడీపీ కలయికతో 2024లో అధికారం చేపడతామన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రూ అనిల్, టీడీపీ నాయకులు కృష్ణ, సత్యనారాయణ, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

వికసిత భారతం

చాగల్లు, జనవరి 4 : మండల కేంద్రమైన చాగల్లు పంచాయతీ కార్యాలయం వద్ద వికసిత భారతం పేరుతో కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇస్తున్న పథకాలు గురించి సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజక వర కన్వీనర్ బూసి సురేంద్రనాథ్ బెనర్జీ పాల్గొని పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రాష్ట్ర ప్రభుత్వం పేర్లు మార్చి అమలుచే స్తుందన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేష్, తాళ్ళూరి వరప్రసాద్, కంచుమర్తి చినసుబ్బారావు, ధనలక్ష్మి, జుట్టా వెంకట గనపతి, ఏలూరి కాంచన, వచ్చిపులుసు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

చాగల్లు, జనవరి 4 : గత పదిహేను రోజులుగా సమ్మెలో పాల్గొంటున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు ఇతర సిబ్బందికి నిత్యావసర సరుకులు ఎంఈవో వి.ఖాద రబాబు అందజేశారు. 25 కేజీల బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎంఈవో 2 సుధాకర్, టీఎన్‌యూఎస్ నాయకులు మెరిపో సూరిబాబు, బొల్లిపో మధుశేఖర్, సమగ్రశిక్షా యూనియన్ నాయకులు గణేష్, వెంక ట్, రాజేష్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

వేలివెన్నులో క్రికెట్ పోటీలు

ఉండ్రాజవరం, జనవరి 4: మండలంలోని వేలివెన్ను గ్రామంలో శశిధర్ మెమోరియల్ సంక్రాంతి సంబరాల్లో భాగంగా జరిగే 2వ రోజు క్రికెట్ పోటీలు గురువారం 6జట్ల మధ్య హోరాహోరీగా పోటీలు జరిగాయి నిడదవోలు, పిట్టలవే మవరం టీమ్‌ల మధ్య పోటీ జరగ్గా పిట్టలవేమవరం,గోపవరం, వేలివెన్ను జట్ల మధ్య పోటీలో గోపవరం జట్టు , శెట్టిపేట-అన్నవరప్పాడు జట్ల మధ్య పోటీలో అన్నవరప్పాడు జట్టు, వడ్లూరు-సమిశ్రగూడెం జట్ల మధ్య పోటీలో సమిశ్రగూడెం జట్టు, కాల్ధరి-చివటం జట్ల మధ్య పోటీలో కాల్ధరి జట్టు, కానూరు-నిడదవోలు జట్ల మధ్య పోటీలో నిడదవోలు జట్టు గెలిపొందినట్లు నిర్వాహకులు బూరుగుపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

● పింఛను తీసుకోవడానికి వెళుతుండగా ఘటన



జాతీయ రహదారిపై ప్రమాదానికి గురై రోడ్డుపై పడివున్న నూతన పింఛన్‌దారు మురమళ్ళ చినబాబురావు

గోపాలపురం, జనవరి 4: నూతనంగా పింఛన్ మంజూరు కావడంతో పింఛన్ తీసుకోవడానికి గోపాలపురం ఏఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి వస్తుండగా దొండపూడి గ్రామానికి చెందిన నూతన పింఛన్ దారు మురమళ్ళ చిన బాబురావు అతని కుమారుడు మురమళ్ళ వీరవెంకట సత్యవరప్రసాద్ ఏఎంసీ కార్యాలయం ముఖద్వారం ఎదురుగా వెళ్లే సరికి దేవరపల్లి వైపునుంచి వస్తున్న బొలెరోవ్యాన్ ఢీకొనడంతో నడిరోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో బాబురావు తలకు, మోకాలికి గాయాలయ్యాయి. అతనితోపాటు ద్విచక్రవాహనంపై వస్తున్న అతని పెద్దకుమారుడు వీరవెంకట సత్యవర ప్రసాద్ ఎడమకాలి మొకాలుపై భాగంలో విరిగిపోవడంతో క్షతగాత్రులను 108 వాహనంపై సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న బాబురావుకు చికిత్స నిమిత్తం రూ.5వేలు అందజేశారు. పథమ చికిత్స అనంతరం బాబురావు అతని కుమారుడు వీరవెంకట సత్య వరప్రసాద్‌ను మెరుగైన వైద్యం కోసం వారి కటుంబ సభ్యులు కొయ్యలగూడెం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

సంక్రాంతి పండుగకు సంఘ వ్యతిరేక కార్యక్రమాలు నిరోధించాలి

తాళ్ళపూడి, జనవరి4: మండలకేంద్రమైన తాళ్ళపూడి మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ అధ్యక్షతన గురువారం అధికారులకు, సచివాలయ సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాబోయే సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు సంస్కృతి సాంప్రదాయాలు పాటించాలి తప్ప కోడిపందాలు, జూదాలు వంటి అసాంఘిక కార్యకలాపాల జోలికి పోకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ మేరకు సంఘ వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టే వారి పట్ల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఏఎస్ఐ ప్రసాదు, సచివాలయ సిబ్బంది, గ్రామ కమిటీల వారు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

పెరవలి, జనవరి 4: పింఛన్‌లు పెంపు విషయంలో సీఎం జగన్ మాట నిలబెట్టుకున్నారని నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలోరూ. 3వేలు పింఛన్‌లు పెంచి అందజేస్తున్నట్లు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో కొత్తగా మంజూరైన పింఛన్‌లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జెడ్‌పీటీసీ కొమ్మిశెట్టి రామాంజని, వీరమల్లు సత్యనారాయణ, పసలపూడి భద్రయ్య, ఎంపీడీవో రమేష్, పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరాముడి అక్షింతలు పంపిణీ



జగన్నాథపురంలో అయోధ్య శ్రీరాయుని అక్షింతలతో భక్తులు

నల్లజర్ల, జనవరి 4 : నల్లజర్ల మండలం జగన్నాధపురం గ్రామంలో గురువారం అయోధ్య శ్రీరాముని పూజిత అక్షింతలు పంపిణీ చేశారు. ముందుగా స్వయంభు శ్రీవల్లిదేవసేన సుబ్రహ్మణ్యం స్వామి, భక్తాంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలుచేసి అంక్షింతలను పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ప్రతి భక్తుడి ఇంటికి అంక్షింతలు అందిస్తామని శ్రీరామా ఆధ్యాత్మిక సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెల్లంకి రాఘవ, ఉప్పలపాటి మాధవ రావు,షైనం వెంకట బ్రహ్మాయ్య, సవలం రామకృష్ణ, సర్పంచ్ చెల్లారి శ్రీను, షైనం చంద్రశేఖర్, మాయలేడి తాతారావు పాల్గొన్నారు.

పాడైన ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతులతో సరి

తాళ్ళపూడి, జనవరి 4 : మండలంలో మలకపల్లి నుంచి ప్రక్కిలంక వరకూ గల పాడైపోయిన ఆర్‌అండ్‌బీ రోడ్లకు కేవలం మరమ్మతులకు మాత్రమే నోచుకోనుంది. వైసీపీ పాలనలో నైనా రోడ్లు బాగుపడతాయని భావించిన ప్రజలకు నిరాశ తప్పడం లేదు. తాళ్ళపూడి మెయిన్‌రోడ్డులో మార్పులు చోటుచేసుకుంటాయని ట్రాఫిక్ ఇబ్బందులు, డ్రైనేజీ సమస్య లు తీరతాయని భావించారు. ఫలితం మాత్రం శూన్యం. ప్రస్తుతం మలకపల్లి నుంచి తాళ్ళపూడి వరకూ పాడైన ఆర్‌అండ్‌బీ రోడ్లను తవ్వి చెత్తను తొలగించే పనులు చేస్తున్నారు. ఇప్పటికైనా కొత్త రోడ్లు వేస్తారో లేదా ఇలాగే వదిలేస్తారో వేచిచూడాల్సిందే.



ఆర్ అండ్ బీ రోడ్లకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

అదివో అల్లదివో శ్రీహరివాసము

● ఘనంగా చతుర్వేద మహాయాగం ప్రారంభం

● శ్రీవారి దర్శనంతో పులకించిన భక్త జనం



శ్రీవేంకటేశ్వరస్వామివారు

రాజానగరం, జనవరి 4: లోక కళ్యాణం, విశ్వశాంతి కాంక్షిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆధ్వర్యంలో గైట్ ప్రాంగణంలో శ్రీవారి వైభవోత్సవం, చతుర్వేద మహాయాగం, వేదమంత్రాలతో మంగళవాయిద్యాల నడుమ గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకుడు కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) దంపతులు, కిమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ రవికిరణ్ వర్మ దంపతులు, గైట్ మేనేజింగ్ డైరెక్టర్ శశికిరణ్ వర్మ దంపతులు, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు దంపతులు, సాంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలనచేసి శ్రీవారి వైభవోత్సవం, చతుర్వేత మహా యాగాలను ప్రారంభించారు. అనంతరం స్వామివారికి సుప్రభాతం, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్ర నామార్చన, నివేదనము, సర్వదర్శనం, తిరుప్పావడ సేవతోపాటు శ్రీవారి కళ్యాణోత్సవం కన్నుల పండువగా తిరుపతి వైఖానస ఆగమ పండితులు దీవి బాలాజీ రంగాచార్యులు పర్యవేక్షణలో వైభవంగా జరిపించారు. సాయంత్రం నుంచి స్వామివారి సర్వదర్శనం, శుద్ధి ఏకాంత సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అన్నవరం, ద్వారకాతిరుమల



యాగశాల క్రతువులో కనుమూరి బాపిరాజు, చైతన్యరాజు దంపతులు

నుంచి వచ్చిన రథాలతో కొలువైన సత్యదేవుడు, శ్రీవేంకటేశ్వరస్వామి అమ్మవార్లకు కూడా ఆయా ఆలయఅర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు అధికసంఖ్యలో స్వామివార్లను దర్శించుని తీర్థప్రసాదాలు స్వీకరిం చారు. బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో ద్వాదశి జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బైర్రాజు ప్రసాదరాజు, మాజీ ఎమ్మెల్యే ఈలి నాని, ప్రముఖులు డీటీవీ రాజు, కేశవరాజు స్వామివారికి ప్రత్యేకపూజలు అనంతరం స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

అంతర్జాతీయ తెలుగు మహా సభలకు ఏర్పాట్లు పూర్తి

చైతన్య విద్యాసంస్థలు, ఆంధ్ర సారస్వత పరిషత్ సంయుక్తంగా గైట్ ప్రాంగణంలో తలపెట్టిన అంతర్జాతీయ తెలుగుమహా సభలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. శ్రీరాజరాజ నరేంద్రుల పట్టాభిషిక్త సహస్రాబ్ది ఉత్సవాలు నీరాజనంగా నన్నయ భట్టారకుని మహాభారతం వెయ్యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అంతర్జాతీయ తెలుగు మహాసభలను రాజమహేంద్రవరం వేదికగా గైట్ కళాశాల ప్రాంగ ణంలో నిర్వహిస్తున్నట్లు చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకులు కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ తెలిపారు. మూడు రోజులపాటు తెలుగు మహాసభలు జరుగుతాయన్నారు. దీనిలో భాగంగా గైట్ ప్రాంగణంలో రాజ రాజనరేంద్రుని వేదికతోపాటు గైట్ డిగ్రీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాలలో నారాయణభట్టు వేదిక, ఆదికవి నన్నయ్య వేదికలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే అంతర్జాతీయ తెలుగు మహాసభలను పురస్కరించుకుని గైట్ ప్రాంగణంలోని ప్రధాన వేదికలవద్ద ఏర్పాటుచేసిన ప్రముఖుల విగ్రహాలు జీవకళ ఉట్టిపడుతూ చూపరులను కట్టిపడేస్తున్నాయి. సర్ ఆర్థర్ కాటన్, రచనలు, గానామృతాలతో తెలుగు భాషకు వన్నె తెచ్చిన గాయనీ, గాయకులు ఎంఎస్ సుబ్బలక్ష్మి, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, సంఘసంస్కర్త వీరేశలింగం పంతులు, కవయిత్రి మొల్ల విగ్రహాలు జీవకళలొలికిస్తున్నాయి.



గోపాలపురంలో అంగన్‌వాడీల నిరసన ప్రదర్శన

గడ్డి తింటూ అంగన్‌వాడీల వినూత్న నిరసన

● 24వ రోజుకు చేరిన సమ్మె

కొవ్వూరు, జనవరి 4: అంగన్వాడీలు ఎండుగడ్డి తింటూ వినూత్నంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ ఆధ్వర్యంలో గురువారం కొవ్వూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల 24వ రోజు సమ్మెను కొనసాగించారు. రాష్ట్ర ప్రభుత్వ మొండివైఖరిని నిరసిస్తూ ఎండుగడ్డి తింటూ నిరసన ప్రదర్శన చేపట్టారు. మాణిక్యాంబ మాట్లాడుతూ గత 24 రోజులుగా ఆకలి కేకలతో రోడ్డెక్కి సమ్మె చేస్తున్న అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా కక్ష సాధింపుచర్యలు చేపట్టడం బాధాకరమన్నారు. న్యాయమైన కోర్కెలు పరిష్కరించమని అడిగితే మాపై చర్యలు తీసుకుంటామని నోటీసులు అంటించడం సరైందికాదన్నారు. సీఎం జగన్‌రెడ్డి మా గురించి ఆలోచించక పోతే మీ గురించి ఆలోచించాల్సి వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్ పుష్పావతి, ఎ.నరసమాంబ, బి. పద్మజ, బి.వసంత, డి.అమరావతి, సి.హెచ్. బ్రహ్మమ్మ, వి.శ్రీదేవి, చిన్న లక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. సుందరాబాబు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: అంగన్వాడీలకు న్యాయమైన కోర్కెలు తీర్చాలని 22 రోజులుగా సమ్మెచేస్తున్న ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందని అంగన్వాడీ సంఘం నాయకురాలు టీపీ లక్ష్మి విమర్శించారు. పద్మకామేశ్వరి, మంగతాయారు, కుమారి పాల్గొన్నారు.

గోపాలపురం: తమ డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంగన్వాడీలు చేపట్టిన సమ్మె గురువారానికి 24వ రోజుకు చెరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు రామలక్ష్మి మాట్లాడుతూ అడగకుండానే హామీలు ఇవ్వడం వాటిని నెరవేర్చలేక మాట మార్చటం రాజకీయ పార్టీలకు పరిపాటిగా మారిందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కోడి పందాలు, గుండాటలు నిర్వహిస్తే చర్యలు

● కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ



కొవ్వూరు డివిజన్ అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ

కొవ్వూరు, జనవరి 4 : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో కోడి పందాలు, గుండాట వంటి జూదక్రీడలు నిర్వహించినట్లయితే చర్యలు తప్పవని కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ హెచ్చరించారు. గురువారం కొవ్వూరు డివిజన్‌లోని పోలీసు, రెవెన్యూ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఏ ప్రాంతంలో కోడిపందాలు, జూద క్రీడలు నిర్వహణకు అనుమతి లేదన్నారు. ఎవరైనా బరులు ఏర్పాటుచేసినట్లయితే చర్యలు తప్పవన్నారు. కోడిపందాలు, జూద క్రీడలను నిషేధిస్తూ హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. సంక్రాంతి పండుగ ముసుగులో కోడిపందాలు, గుండాట. పేకాట వంటి జూదక్రీడలు నిర్వహించకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామ స్థాయిలో జాయింట్ ఇన్‌స్పెక్షన్ టీమ్‌లు ఏర్పాటుచేయాలని, పంచాయతీ కార్యదర్శులు, తహశీల్దార్‌లు ఎస్‌హెచ్‌ఓలు గ్రామాలలో మైక్‌ల ద్వారా ప్రచారం చేయాలన్నారు. జంతువులపై క్రూరత్వ నిరోధక చట్టం, 1960, ఏపీ గ్యాంబ్లింగ్ చట్టం 1974పై ప్రజలకు అవ గాహన కల్పించడంతోపాటు ఫ్లెక్సీలు ఏర్పాటుచేయాలన్నారు. తహశీల్దార్లు, ఎస్‌హెచ్‌వోలు జాయింట్ ఇన్‌స్పెక్షన్ టీమ్‌లతో కలిసి కోడిపందాలు నిర్వహించే స్థలాలను గుర్తించి తగినచర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు హైకోర్టు ఉత్తర్వులను సమర్ధవంతంగా అమలు చేసేందుకు వీఆర్వో, సచివాలయ కార్యదర్శులు, వీఆర్‌ఏలతో గ్రామ పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటుచేయాలన్నారు. కోడిపందాలు, జూదక్రీడలు నిర్వహించినట్లయితే ఆయా స్థలాల యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు అధికారులు పికెటింగ్‌లతో పాటు సర్వేలెన్స్ కెమెరాల పర్యవేక్షణ ఏర్పాటుచేయాలన్నారు. ఎస్‌హెచ్‌వోలు, తహశీల్దార్‌లు రోజువారి నివేదికలను సబ్ కలెక్టర్ కార్యాలయానికి సమర్పించాలన్నారు. కోడిపందాలు, జూద క్రీడలను అరికట్టడానికి ఎంపీడీవోలు, సచివాలయ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీవో కార్యాలయ ఏవో జి.ఎస్.ఎస్. జవహార్ బాజి, డీఎస్పీ వి.ఎస్.ఎన్. వర్మ, కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు, రూరల్ సీఐ కె.వెంకటరమణ, తహసీల్దార్‌లు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తూ మునిసిపల్ కార్మికుల నిరసన

● రోడ్డుపై వంటావార్పు కార్యక్రమం

● 10వ రోజుకు చేరిన సమ్మె



మున్సిపల్ కార్యాలయం వద్ద వంటా వార్పు చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు

కొవ్వూరు, జనవరి 4 : భిక్షాటన ద్వారా వచ్చిన సరుకులతో మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు రోడ్డుపై వంటా వార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. గురువారం కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు 10వ రోజు సమ్మెలో భాగంగా భిక్షాటన ద్వారా వచ్చిన సరుకులతో వంటా వార్పు కార్యక్రమం చేపట్టారు. శిబిరం వద్దే భోజనాలు చేసి ప్రభుత్వం కార్మికులను రోడ్డు పాలు చేసిందని వాపోయారు. కార్మిక సంఘం నాయకులు రాజాన అప్పారావు, మీసాల కిషోర్ లు మాట్లాడుతూ ధరలు పెంచుతున్న ప్రభుత్వాలను వేతనాలు పెంచే బాధ్యత లేదా అని ప్రశ్నించారు. కనీస వేతనాలు పెంచేవరకు సమ్మె విరమించేది లేదన్నారు. కార్యక్రమంలో పూజారి వాసు, భూపతి రవీంద్ర, కళ్యాణి రాజేష్, మీసాల ప్రేమ్, ఎం.జ్యోతి, కె.ప్రసాద్, ఎం.శ్రీను, వి.శ్యాం, ఎం.శకుంతల, మాండ్రు సుధీర్, ఎం.కిషోర్, ఎ.విజయకుమార్, కె.దుర్గాప్రసాద్, సిఐటీయు జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు, తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మెకు ఐఎఫ్‌టీయూ, పిఓడబ్ల్యు నాయకులు మద్దతు తెలిపారు.



నిడదవోలు తహశీల్దార్ కార్యాలయంవద్ద మాట్లాడుతున్న రాష్ట్ర వర్కింగ్ కమిటీ నాయకుడు రేఖా భాస్కరరావు

పారిశుధ్య కార్మికుల నిరసన ప్రదర్శన

నిడదవోలు, జనవరి 4 : వైసీపీ ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను అంగీకరించేంతవరకు పోరాటం ఆగదని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ నాయకులు రేఖా భాస్కరరావు అన్నారు. గురువారం నిడదవోలు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంవద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు రాస్తారోకో చేశారు. రాష్ట్ర వర్కింగ్ కమిటీ నాయకులు రేఖా భాస్కరరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. సుప్రీమ్‌కోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనంలో భాగంగా కనీస వేతనం 26వేలు ఇవ్వాలని అన్నారు. పర్మినెంటు కార్మికులకు 2021 నుంచి ఇవ్వాల్సిన సరెండర్ లీవ్ ఎన్‌కేష్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించేంత వరకు తమ పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఏఐటీయూసీ నాయకులు మాముడూరి నాగేంద్రవరప్రసాద్, క్రొవ్విడి నాగరాజు, కాకి అప్పలరాజు, బొచ్చా ముద్దుకృష్ణ, బందారు రాంబాబు, కాకి దుర్గా ప్రసాద్, జగ్గమ్మ, లక్ష్మీదుర్గ, తూరుగోపుల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం

నల్లజర్ల, జనవరి 4 : నల్లజర్లలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆరు గ్రానైట్ గుమ్మాలు నిర్మించేందుకు నల్లజర్లకు చెందిన కోరా కన్నయ్య రాజేశ్వరి దంపతులు గురువారం రూ.5లక్షలు విరాళం అందించినట్లు శ్రీ కళ్యాణ వెంకటేశ్వరరా స్వామి ఆలయ కమిటీ పేర్కొంది. అనంత రం ద్వార బంధన స్థాపన పూజా కార్యక్రమాలు కోరా కన్నయ్య దంపతులచే నిర్వహించారు. గ్రామ దేవత సోమాలమ్మతల్లి ఆలయ అభివృద్ధికి మరో రూ.5లక్షలు విరాళం అందించినట్లు కన్నయ్య దంపతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొయ్యలమూడి నాగార్జున,ఎస్.రామ కృష్ణ పాల్గొన్నారు



వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షలు విరాళం ఇచ్చిన కోరా కన్నయ్య దంపతులు

జయహో బీసీ కార్యక్రమానికి తరలివెళ్లిన నాయకులు

కొవ్వూరు, జనవరి 4 : జయహో బీసీ కార్యక్రమానికి కొవ్వూరు నియోజకవర్గం నుంచి బీసీ నాయకులు తరలివెళ్లారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయం నుంచి గురువారం బీసీ నాయకులు కార్లలో మంగళగిరిలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రారంభించనున్న జయహో బీసీ కార్యక్రమానికి తరలివెళ్లారు. టీడీపీ పట్టణ బీసీ సంఘం అధ్యక్షుడు కాగిత రఘు మాట్లాడుతూ బీసీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. రాన్నున్న ఎన్నిక ల్లో చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిని చేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి రాజాన శ్రీని వాస్, కిలాని రమణ, మాసాని వీరబాబు, చెట్టే కొవ్వూరు, మైలపల్లి దేవుడు, చెట్టే శ్రీను, ఎం.చక్రపాణి ఉన్నారు.

నిడదవోలు: నిడదవోలు పట్టణంలోని టీడీపీ కార్యాలయం నుంచి గురువారం మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఆదేశాలతో పట్టణ తెలగుదేశంపార్టీ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు మంగళగిరి టీడీపీ కార్యాలయంలో జరుగుతున్న జయహో బీసీ కార్యక్రమానికి తరలివెళ్లారు.





కొవ్వూరు, నిడదవోలు నుంచి మంగళగిరి చంద్రబాబు సమావేశానికి వెళ్తున్న టీడీపీ బీసీ నాయకులు

కొట్లాట కేసులో ఇరువర్గాలపై కేసు నమోదు

కొవ్వూరు, జనవరి 4 : కొట్లాట కేసులో ఇరువర్గాలపై కేసునమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ జగతా శ్రీనివాసరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం కొవ్వూరు పట్టణానికి చెందిన షేక్ షాజహన్, షేక్ నన్నలు గురువారం ఉదయం మెరకవీధిలో ఘర్షణపడ్డారు. దీంతో ఇరువర్గాలకు చెందిన వారు అక్కడకు చేరుకుని ఒకరిపై ఒకరు కలబడ్డారు. ఈ ఘటనలో ఇరువర్గాలకు గాయాలు కావడంతో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. షాజహన్, నన్నల ఫిర్యాదులతో రెండు వర్గాలపై కేసునమోదు చేసినట్లు హెచ్‌సి శ్రీనివాసరావు తెలిపారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్ర్కీన్1	డెవిల్
వై.స్ర్కీన్2	సలార్
దేవిశ్రీ(గాయత్రి)	హాయ్ నాన్న
అనన్య	సలార్

నిడదవోలు

వీ మ్యాక్స్	డెవిల్
రాధాకృష్ణ	వెంకి
శ్రీగణపతి	సలార్

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	సలార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్	సలార్

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్

షార్ట్‌సర్క్యూట్‌తో 18 ఎకరాల చెరకు తోట దగ్ధం

గోపాలపురం, జనవరి 4: మండలంలోని తొక్కిరెడ్డిగూడెం సమీపంలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు 18ఎకరాల చెరకుతోట దగ్ధమైంది. గోపాలపురం గ్రామానికి చెందిన రైతు భాస్కరరావు చెరకుతోటపై ఉన్న విద్యుత్ తీగల నుంచి మంటలు రావడంతో చెరుకుతోటకు నిప్పంటు కుందని రైతు భాస్కరరావు తెలిపారు. సుమారు 20ఎకరాల చెరకు పంట చేతికి వచ్చే సమయంలో 18 ఎకరాలు కాలిపోగా 2ఎకరాలు మాత్రమే మిగిలిందన్నారు. పరిసర ప్రాంత రైతుల సమాచారంతో జంగారెడ్డిగూడెం నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపుచేసే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ చాలా వరకు చెరుకుతోట కాలిపోయిందన్నారు. నష్టం సుమారు రూ.10లక్షల వరకు ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది చెబుతున్నారు.



తొక్కిరెడ్డిగూడెం సమీపంలో దగ్ధమవుతున్న చెరకుతోటను మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

తూతూమంత్రంగా మండల సర్వసభ్య సమావేశం

నల్లజర్ల, జనవరి 4 : నల్లజర్ల మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. గురువారం నల్లజర్ల మండల పరిషత్ కార్యాయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బంకా జయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి నిధులతో గ్రామాల్లో తాగునీరు, డ్రైన్స్, మహిళా, శిశు సంబంధిత పనులు మొత్తం 7 అంశాలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి పనులు గుర్తించాలని సూచించారు. ప్రభుత్వశాఖల పనితీరుపై ప్రశ్నించిచే నాథుడే కరువయ్యారన్నారు. పూర్తిస్థాయిలో సభ్యులు, అధికారులు హాజరుకాలేదు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్, తహసీల్దార్ కిషోర్, కారుమంచి రమేష్, అచ్యుత శివాజీ పాల్గొన్నారు.